ప్రజాశక్తి

ఆదివారం 16 మార్చి 2025 8 పేజీలు






గుంటూరు పల్నాడు

మేయర్ రాజీనామా కలకలం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి


Kavati Siva Naga Manohar Naidu
Mayor, Guntur Municipal Corporation
GUNTUR Dist, Andhra Pradesh, India
0863- 2956668 | +91 98494 88999, 98499 08384

Date: 15/3/2025

To
The Collector & District Magistrate,
Guntur District,
Guntur.

Sub: Resignation for the post of Mayor Regd/-

Dear Madam

Please accept my resignation for the post of Mayor for Guntur Municipal Corporation with immediate effect.

Yours faithfully,
K.S.N. Manohar 15/3/2025
Kavati Siva Naga Manohar Naidu
Mayor Guntur Municipal Corporation

Address : Door No. 81-151, R. Agraharam, Sampath Nagar, Main Road, GUNTUR - 522 004, A.P. India

మేయర్ రాజీనామా లేఖ

- **ఇన్‌ఛార్జి మేయర్‌గా సజీల?**
- **రేపు స్టాండింగ్ కమిటీ భేటిపై సందిగ్ధత**
- **కౌన్సిల్ సమావేశంపై తొలగని ప్రతిష్టంభన**

గుంటూరు నగర పాలక సంస్థ మేయర్ కావటి మనోహర్ నాయుడు రాజీనామా వ్యవహారం అటు అధికారుల్లో, ఇటు రాజకీయ వర్గాల్లో కలకలం రేపింది. కార్పొరేషన్‌లో గత మూడు నెలలుగా నెలకొన్న పరిణామాలు మేయర్ రాజీనామా వరకు దారితీశాయి. మూడు నెలలుగా కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహణపై ప్రతిష్టంభన కొనసాగుతోంది. డిసెంబరు 20న నిర్వహించాల్సిన కౌన్సిల్ సాధారణ సమావేశం స్వల్ప చర్చలతో అసంపూర్తిగా వాయిదా పడగా ఆ తరువాత జనవరి 4న జరిగిన సమావేశంలో గందరగోళం చోటుచేసుకుంది. జనవరి 4న వాయిదా పడిన సమావేశం ఇప్పటి వరకు జరగలేదు. కమిషనర్ పులి శ్రీనివాసులు సోమవారం స్టాండింగ్ కమిటీ సమావేశం నిర్వహించేందుకు నిర్ణయించారు. ఈ సమాచారాన్ని మేయర్‌కు పంపారు. అయితే తన ప్రమేయం లేకుండానే స్టాడింగ్ కమిటీ సమావేశంపై నిర్ణయం తీసుకోవడంతో మేయర్ మనస్థాపం చెందినట్టు చెబుతున్నారు. అంతేగాక కౌన్సిల్ సమావేశంపై ఇంత వరకు మేయర్‌ను కమిషనర్ సంప్రదించలేదని మేయర్ వర్గం చెబుతోంది. ఈ నేపథ్యంలో మేయర్ ఏకంగా రాజీనామా లేఖను కలెక్టర్‌కు పంపుతున్నట్టు ప్రకటించడంతో సోమవారం జరిగే స్టాడింగ్ కమిటీ సమావేశం నిర్వహిస్తారా? లేదా? అనేదానిపై అధికారులు నిర్ణయం ఇంకా ప్రకటించలేదు.

మేయర్ రాజీనామాను ఆమోదిస్తే డిప్యూటీ మేయర్ సజీలను ఇన్‌ఛార్జి మేయర్‌గా నియమించే అవకాశం ఉంది. ఆమె అధ్యక్షతన స్టాండింగ్ కమిటీ, తరువాత కౌన్సిల్ సమావేశం నిర్వహించాలని టిడిపి నాయకులు యోచిస్తున్నారు. ఈ మేరకు అధికారులతో టిడిపి నాయకులు సంప్రదింపులు జరుపుతున్నారు. మేయర్ రాజీనామా ఆమోదం తరువాత నూతన మేయర్‌ను ఎన్నుకునేందుకు ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ జారీ చేయాల్సి ఉంది. ఇందుకు పక్షం రోజులు సమయం పట్టే అవకాశం ఉంది. ఈలోగా డిప్యూటీ మేయర్‌తో పాలన వ్యవహారాలకు సంబంధించిన ప్రక్రియను పూర్తి చేయాలని అధికారులు యోచిస్తున్నారు. ఈ మేరకు ఉన్నతాధికారులను సంప్రదిస్తున్నారు. మేయర్ స్థానంలో డిప్యూటీ మేయర్‌కు ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించవచ్చా. ఎంత కాలం ఇన్‌ఛార్జిని కొనసాగించవచ్చు... తదితర అంశాలపై న్యాయపరమైన చిక్కులను కూడా పరిశీలిస్తున్నారు.

మరోవైపు మేయర్ ఆకస్మిక నిర్ణయంపై వైసిపిలో కూడా కొంత అసంతృప్తికి దారితీసింది. వైసిపికి ఉన్న 23 మంది కార్పొరేటర్లతో ఆయన మాట మాత్రం చెప్పకుండా నిర్ణయం తీసుకున్నారని డిప్యూటీ మేయర్ డైమండ్ బాబు వ్యాఖ్యానించారు. పార్టీ జిల్లా నగర అధ్యక్షులకు కూడా సమాచారం ఇవ్వలేదని తెలిసింది. ▶ 2లో



సభ్యులు లేక ఖాళీగా ఉన్న కుర్చీలు

కోరం కష్టాలు

- **సభ్యుల్లేక జెడ్పీ సమావేశం వాయిదా**
- **కీలకమైన బడ్జెట్ ఆమోదానికి బ్రేకులు**
- **తగ్గిన జిల్లా పరిషత్ ఆదాయం**

ప్రజాశక్తి-గుంటూరు

ఉమ్మడి గుంటూరు జిల్లా ప్రజా పరిషత్ బడ్జెట్ ఆమోదానికి శనివారం ఏర్పాటు చేసిన సర్వసభ్య సమావేశం కోరం లేక వాయిదా పడింది. రాబోయే ఆర్థిక సంవత్సరానికి అవసరమైన బడ్జెట్ ఆమోదానికి కీలకమైన సమావేశం వాయిదా పడటం చర్చనీయాంశమైంది. జెడ్‌పిటిసిలు, ఎంపిపిలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు కలిపి 82 మంది సభ్యులున్న జెడ్పీలో సమావేశం నిర్వహణకు కనీసం మూడింట ఒక వంతు మంది సభ్యుల హాజరు ఉండాలి. కానీ జెడ్పీ చైర్‌పర్సన్ సహా 13 మంది మాత్రమే హాజరయ్యారు. పిడిఎఫ్ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు మినహా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు హాజరు కాలేదు. మధ్యాహ్నం 2.30 గంటలకు సమావేశం ప్రారంభం కావాల్సి ఉండగా గంటసేపు సమయం ఇచ్చినా కోరం సంఖ్య రాలేదు. దీంతో సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్లు గంట తర్వాత జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా ప్రకటించారు. అంతకు ముందు నిర్వహించిన స్థాయి సంఘాల సమావేశాలూ వాయిదా పడ్డాయి. మొత్తం ఏడు స్థాయి సంఘాలకుగాను 1, 7 సంఘాలు మాత్రమే జరిగాయి. మిగిలిన 2, 4, 3, 5, 6 స్థాయి సంఘాలు కోరం లేక వాయిదా పడ్డాయి.

మార్చితో ఆర్థిక సంవత్సరం ముగుస్తున్నందున మరో 15 రోజుల్లోనే సమావేశం నిర్వహించాల్సి ఉంది. లేదంటే రాబోయే ఆర్థిక సంవత్సరానికి అవసరమైన అవసరమైన నిధులు విడుదలకు ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉంది.ఈ నేపథ్యంలో ఏమి చేయాలని అధికారులు సమాలోచన చేస్తున్నారు. 54 జెడ్పీ స్థానాలకుగాను 53 స్థానాల్లో ▶ 2లో



మాట్లాడుతున్న హరిప్రసాద్

ఆర్టీసి ప్రైవేటీకరణ విధానాలు ఆపాలి

ప్రజాశక్తి-గుంటూరు

విద్యుత్ బస్సుల పేరుతో ఆర్టీసీలో దొడ్డి దారిన ప్రైవేటీకరణకు చేస్తున్న ప్రయత్నాలు ఆపాలని స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఎస్‌డబ్ల్యూఎఫ్) రాష్ట్ర కార్యదర్శి ఎం.హరిప్రసాద్ డిమాండ్ చేశారు. విద్యుత్ బస్సులు ఆర్టీసీకి ఇచ్చే విధంగా కేంద్ర ప్రభుత్వంతో రాష్ట్ర ప్రభుత్వం చర్చించాలని కోరారు. శనివారం స్థానిక సిఐటియు జిల్లా కార్యాలయంలో జరిగిన ఫెడరేషన్ జిల్లా జనరల్‌బాడీ సమావేశంలో హరిప్రసాద్ మాట్లాడుతూ ఆర్టీసీలో విద్యుత్ బస్సులు ప్రైవేటు సంస్థల ద్వారా మాత్రమే తీసుకోవాలని చెప్పటం ఆర్టీసీని ప్రైవేటుపరం చేయడమేనని అన్నారు. ఆర్టీసీలో శిక్షణ గలిగిన నాణ్యమైన డ్రైవర్లు, మెకానిక్‌లు ఉన్నందున విద్యుత్ బస్సులను ఆర్టీసీ సమర్థవంతంగా నిర్వహించగలరని చెప్పారు. ఆర్టీసీకే విద్యుత్ బస్‌లు ఇచ్చే విధంగా అన్ని సంఘాలను ఐక్యం చేసి ఉద్యమిస్తామన్నారు. దీనిలో భాగంగా మార్చి 24న చలో ఢిల్లీ కార్యక్రమం జరుగుతుందని, ఆ సందర్భంగా డిపోలలో ఆందోళన కార్యక్రమాలు చేయాలని ▶ 2లో

గుజ్జనగుండ్ల వద్ద వెండింగ్ జోన్ ప్రారంభం

ప్రజాశక్తి-గుంటూరు

రాష్ట్రంలో తొలిసారిగా గుంటూరు నగరంలో వీధి వ్యాపారుల సౌలభ్యం, సంక్షేమం కోసం గ్రీన్ వెండింగ్ జోన్ ఏర్పాటు చేశామని, వీధి వ్యాపారులపై దోపిడీకి అడ్డుకట్ట వేస్తున్నామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు అన్నారు. శనివారం గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవితో కలిసి స్థానిక గుజ్జనగుండ్ల మహిళా పాలిటెక్నిక్ కాలేజి వద్ద వీధి వ్యాపారుల వెడింగ్ జోన్ ప్రారంభించి, గుర్తింపు కార్డులు అందించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో వీధి వ్యాపారులు రోడ్లు, డ్రెయిన్ల మీద వ్యాపారాలు చేసుకోవడం వల్ల ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని, వారిని కొందరు అద్దెల పేరుతో దోపిడీ చేయడం గుర్తించామని అన్నారు. తొలి విడతగా పాలిటెక్నిక్ కాలేజి వద్ద 56 మంది వీధి వ్యాపారులకు గుర్తింపు కార్డులు అందిచామని, దశలవారీగా నగరంలో వెండింగ్ జోన్లు ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రోడ్ల విస్తరణ జరిగినప్పటికీ రోడ్ల ఆక్రమణ చేసి వ్యాపారాలు చేయడం, కొనుగోలు చేసే వారి వాహనాల వలన తీవ్రట్రాఫిక్ సమస్య ఏర్పడుతోందన్నారు. వీధి వ్యాపారుల జీవనోపాధికి భంగం కలగకుండా, ప్రజలకు అందుబాటులో ఉండేలా వెండింగ్ జోన్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఇప్పటికే పశ్చిమ నియోజకవర్గ పరిధిలో 2 వేల మంది వీధి వ్యాపారుల గుర్తింపు కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్నారని, వారిలో అర్హులను గుర్తించడానికి జిఎంసి చర్యలు తీసుకుంటుందని చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ షేక్ సజిలా, కార్పొరేటర్లు ఎం.పద్మశ్రీ, ఇ.వరప్రసాద్, సిటి ప్లానర్ రాంబాబు, ఎస్ఇ నాగమల్లేశ్వరరావు, డిప్యూటీ కమిషనర్లు సిహెచ్.శ్రీనివాస్, టి.వెంకటకృష్ణయ్య, ఉపా సెల్ పిఒ రామారావు పాల్గొన్నారు.



వ్యాపారులకు గుర్తింపు కార్డులు ఇస్తున్న కమిషనర్, ఎమ్మెల్యే



రంజాన్ సమయాలు

ఇఫ్తార్ : 6.23 (శనివారం - సాయంత్రం)

సహర్ : 4.59 (ఆదివారం - ఉదయం)

వార్త మెయిన్‌లో



రాజధానిలో వైభవంగా శ్రీనివాస కళ్యాణం

స్థానిక సంస్థల్లో పట్టుకోసం టిడిపి దూకుడు

8లో

గ్రామకంఠాల సమస్యను పరిష్కరించండి

5లో

సిఆర్‌డిఎ కమిషనర్ కన్నబాబుకు రాజధాని రైతుల విజ్ఞప్తి

మేయర్ రాజీనామా కలకలం

(మొదటి పేజీ తరువాయి)

టిడిపి అవిశ్వాసం పెట్టడానికి ముందే మేయర్ రాజీనామా చేయడంతో తదుపరి చర్యలపై ఆ పార్టీ నాయకులు మల్లగుల్లాలు పడుతున్నారు. మేయర్‌గా ఎవరిని ఎంపిక చేయాలన్న అంశంపై ఇంకా స్పష్టత రాలేదు. కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ఇప్పటికే ఒక విడత కార్పొరేటర్ కోవెలమూడి రవీంద్రను పేరును ప్రస్తావించగా పలువురు వ్యతిరేకించారు. దీంతో టిడిపిలో మేయర్ అభ్యర్థి ఎంపికపై ప్రతిష్టంభన ఏర్పడింది. గత ఎన్నికల్లో గుంటూరు పశ్చిమ టిక్కెట్టు ఇవ్వకపోవడం వల్ల ఆయనకే మేయర్ ఇవ్వాలని పలువురు సీనియర్లు చేసిన ప్రతిపాదనను అధిష్టానం ఆమోదించినా స్థానిక నేతల్లో ఉన్న భేదాభిప్రాయాల వల్ల ఏకాభిప్రాయం లేకుండా పోయింది.

ఆర్టీసి ప్రైవేటీకరణ విధానాలు ఆపాలి

(మొదటి పేజీ తరువాయి)

పిలుపునిచ్చారు. ఆర్టీసీలో నియామకాలు చేపట్టాలని, ప్రమోషన్లు ఇవ్వాలని, కొత్త బస్సులు కొనుగోలు చేయాలని, ఒత్తిడితో కూడిన పని విధానాలను ఆపివేయాలని డిమాండ్ చేశారు. కొత్త పిఆర్సి వేయాలని, ఈలోగా ఐఆర్ ప్రకటించాలని పెండింగ్ డిఏలు బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు డి.లక్ష్మీనారాయణ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రవాణా చట్టాలను కార్మిక చట్టాలను సమూలంగా మారుస్తోందని, భవిష్యత్తులో యూనియన్ ఏర్పాటు చేసుకోవటమూ కష్టసాధ్యం అవుతుందని, ఉద్యోగులు, కార్మికులు సమిష్టిగా కేంద్ర ప్రభుత్వ విధానాలను వెనక్కి కొట్టాలని పిలుపునిచ్చారు. ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి టివిజి రవిశంకర్ మాట్లాడుతూ 1/2019 సర్కులర్‌ను సక్రమంగా అమలు చేయించుకోవాలని పిలుపునిచ్చారు. సమావేశానికి ఫెడరేషన్ జిల్లా ఉపాధ్యక్షులు జివి సుబ్బారావు అధ్యక్షత వహించగా గుంటూరు-1 డిపో కమిటీ కార్యదర్శి రామకృష్ణ, గుంటూరు-2 డిపో కమిటీ కార్యదర్శి శ్రీనివాసరావు, మంగళగిరి డిపో కమిటీ కార్యదర్శి పాములు, జోనల్ కమిటీ సభ్యులు మధుసూదన్‌రావు, ఇతర జిల్లా కమిటీ సభ్యులు ఉద్యోగులు పాల్గొన్నారు.

మాచర్ల-కర్నూలు బస్సును పునరుద్ధరించాలని ఫోన్లు

ప్రజాశక్తి - మాచర్ల

స్థానిక ఆర్టీసీ డిపోలో శనివారం డయల్ యువర్ మాచర్ల డిఎం కార్యక్రమం జరిగింది. ప్రజల నుండి విన్నపాలను డిపో మేనేజర్ బత్తుల వీరస్వామి స్వీకరించారు. 33 మంది ప్రయాణికులు ఫోన్ చేసి తమ ఫిర్యాదులను వినతులను తెలిపారు. వీటిల్లో దాదాపు 25 ఫోన్ కాల్స్ వరకు మాచర్ల - కర్నూలు బస్సును పునరుద్ధరించాలని కోరినట్లు డిఎం తెలిపారు. ఈ అంశాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

17, 24 తేదీల్లో డాక్టర్ ఎన్టీఆర్ వైద్యసేవ ఉద్యోగులు విధుల బహిష్కరణ

ప్రజాశక్తి - వినుకొండ



డాక్టర్ ఎన్టీఆర్ వైద్యసేవ పథకంలో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం 17, 24 తేదీల్లో రాష్ట్రవ్యాప్తంగా విధులను బహిష్కరిస్తున్నట్లు ఏపీ వైద్య సేవ ఎంప్లాయిస్ జేఏసీ నాయకులు మాచర్ల బుజ్జి, కాకాని అప్పారావు, సింగంశెట్టి వెంకటేశ్వర్లు, హనుమంతరావు తెలిపారు. కూటమి ప్రభుత్వం ఎన్టీఆర్ విఎస్ పథకాన్ని బీమా పరిధిలోకి తీసుకెళ్లేందుకు రంగం సిద్ధం చేస్తోందని, అస్కాస్ రద్దు దిశగా అడుగులేస్తోందని అన్నారు. 17 ఏళ్లుగా అరకొర జీతాలతోనే ప్రభుత్వాలు సరిపెడుతున్నాయని, కుటుంబ పోషణ భారమై తమ పిల్లల భవిష్యత్తు ఏమిటో కూడా అర్థం కావడం లేదని వాపోయారు. ప్రభుత్వం స్పందించకుంటే కఠినతరమైన పోరాటాలకూ సిద్ధమని స్పష్టం చేశారు.

కోరం కష్టాలు

(మొదటి పేజీ తరువాయి)

వైసిపి సభ్యులు గెలుపొందారు. శావల్యాపురం స్థానాన్ని మాత్రమే టిడిపి గెలుపొందింది. ఎన్నికల సమయంలోనే జెడ్పీ ఛైర్‌పర్సన్ టిడిపిలో చేరారు. ఎన్నికల అనంతరం అనేక సమావేశాలు జరిగినా సభ్యుల హాజరు సమస్య రాలేదు. కూటమి 9 నెలల పాలన అనంతరం జరిగిన ఈ సమావేశాలు, అందులోనూ బడ్జెట్ సమావేశాలకు సభ్యులు గైర్హాజరు కావటం చర్చనీయాంశమైంది. వైసిపి సభ్యులు ఉద్దేశపూర్వకంగా సమావేశానికి గైర్హాజరయ్యారనే చర్చ నడుస్తోంది.



సమావేశంకి హాజరైన జెడ్పీ ఛైర్‌పర్సన్, జెడ్పీ సిఇఒ ఇతర అధికారులు

తగ్గిన ఆదాయం..

ఈ సమావేశంలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించి అంచనా బడ్జెట్, సవరణ బడ్జెట్‌ను, రాబోయే ఆర్థిక సంవత్సరాలకు సంబంధించిన అంచనా బడ్జెట్ ఆమోదించుకోవాలని కీలకమైన అజెండాగా చేర్చారు. జిల్లా పరిషత్ సొంత వనరులతోపాటు, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీరింగ్ విభాగాలకు సంబంధించి ప్రస్తుత 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి అంచనా బడ్జెట్‌లో రూ.870 కోట్ల 97 లక్షల 66 వేలు ఆదాయం ఉంటుందని చూపించారు. కానీ ఆశించిన స్థాయిలో ఆదాయం రాకపోగా దాదాపు సగం తగ్గింది. దీంతో ఆర్థిక సంవత్సరం ముగింపు నాటికి సవరణ బడ్జెట్‌లో రూ.492 కోట్ల 79 లక్షల 43,239వేలు మాత్రమే ఆదాయం వచ్చినట్లు చూపించారు. ఈ ఏడాది ఖర్చులు పోగా రూ.4.80 కోట్లు మిగులు చూపించారు. అదే విధంగా రాబోయే 2025-26 ఆర్థిక సంవత్సరానికి రూ.643 కోట్ల 80 లక్షల 68 వేల అంచనాతో బడ్జెట్ ప్రతిపాదనలు రూపొందించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సర ఆదాయ అంచనాల కంటే వచ్చే ఏడాది అంచనాలు కూడా రూ.200 కోట్లకుపైగా తగ్గినట్లు చూపించటం గమనార్హం. సర్‌ఛార్జి స్టాంప్ డ్యూటీ, తలసరి ఆదాయం, మినరల్ సీజనరేజ్, క్వారీ భూమిలీజు, ఇసుక సీనరేజ్, భవనాలు, షాపులు అద్దెలు ద్వారా దాదాపు రూ.3 కోట్లకుపైగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఆదాయం తగ్గింది. ముఖ్యంగా 15వ ఆర్థిక సంఘం నిధులకు సంబంధించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల గ్రాంట్లు రూ.45 కోట్లు రావాల్సి ఉండగా రూ.27 కోట్లు మాత్రమే వచ్చాయి. వచ్చే ఆర్థిక సంవత్సరంలోనూ రూ.30 కోట్లే గ్రాంట్లు వస్తాయని అంచనా వేశారు. పంచాయతీరాజ్ విభాగానికి సంబంధించి కూడా రూ.622.62 కోట్లకుగాను, ఇప్పటి దాకా రూ.323.22 కోట్లే వచ్చింది. ఆర్‌డబ్ల్యూఎస్ సంబంధించిన నిధులు కూడా రూ.15 కోట్లకుపైగా నిధులు విడుదల కాలేదు.

ప్లాస్టిక్ నిషేధం, స్వచ్ఛత కోసం ర్యాలీలు



ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ప్లాస్టిక్ వాడకం వలన పర్యావరణంపై కలుగు దుష్ఫలితాలు, ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయముగా వాడాల్సిన పర్యావరణహితమైన వస్తువులపై నరసరావుపేట పురపాలక సంఘం ఆధ్వర్యంలో శనివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయం నుండి మల్లమ్మ సెంటర్ వరకు ర్యాలీ కొనసాగింది. జిల్లా కలెక్టర్ పి.అరుణ్ బాబు, ఆర్డీవో మధులత, మున్సిపల్ కమిషనర్ ఎం.జస్వంత్‌రావులు హాజరయ్యారు. మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జ్యూట్, క్లాత్ బాగ్స్ స్టాల్స్‌ను ప్రారంభించారు. ప్లాస్టిక్ నివారణ కోసం రూపొందించిన కరపత్రాలను ఆవిష్కరించారు. వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, కాలేజీల విద్యార్థులు పాల్గొన్నారు.

ఇక్కుర్రులో స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర

నరసరావుపేట మండలం ఇక్కుర్రు గ్రామంలో శనివారం స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల ప్రత్యేకాధికారి మురళి, ఎంపీడీఓ టివి. కృష్ణకుమారి, ఎస్బీఎం (జి) ఎంఆర్పీ అయ్యపరెడ్డి, గ్రామ పెద్దలు వెంకటేశ్వర్లు, రమేష్, గ్రామ పీఎస్ రాధాదేవి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. గ్రామ కూడలిలో ర్యాలీ నిర్వహించి ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఎస్‌డబ్ల్యూపిసి షెడ్‌ను పరిశీలించారు. స్కూల్ ఆవరణంలో మొక్కలను నాటారు. నిషేధిత ప్లాస్టిక్



నిషేధం ద్వారా కలిగే దుష్పరిణామాల గురించి ప్రజలకు వివరించారు. తడి చెత్త, పొడి చెత్తపై అవగాహన కల్పించారు.

ప్రజాశక్తి - వినుకొండ

మండలంలోని నరగాయపాలెంలో స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమం శనివారం నిర్వహించారు. ప్లాస్టిక్ వినియోగం నిషేధంపై అవగాహన కల్పించారు. అనంతరం ర్యాలీ నిర్వహించి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల వద్ద స్వచ్ఛంద్ర ప్రతిజ్ఞ చేయించారు. మండల ప్రత్యేక అధికారి కందుల శ్రీరాములు, మండల స్థాయి అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ ప్రతిభా పారితోషికం అందుకున్న కె-రిడ్జ్ విద్యార్థులు



ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నరసరావుపేట మండలం జొన్నలగడ్డలోని కె-రిడ్జ్ ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థులు ఇటీవల ఆల్ ఇండియా రేడియోలో 6 విదేశీ భాషల్లో అత్యద్భుతమైన ప్రతిభ కనబరిచారని స్కూల్ చైర్మన్ నాతాని వెంకటేశ్వర్లు శనివారం తెలిపారు. భారతదేశంలో 6 విదేశీ భాషలలో శిక్షణ ఇచ్చే ఏకైక స్కూల్ కె-రిడ్జ్ ఇంటర్నేషనల్ స్కూల్ అన్నారు. ఫ్రెంచ్, జర్మన్, స్పానిష్, టాలియన్, ఇంగ్లీష్, జపనీస్ భాషలలో అంతర్జాతీయ స్థాయిలో బహుభాషిగా పేరు గాంచిన ప్రఖ్యాత పోలిగ్లాట్ పూలబాల కె-రిడ్జ్ లో విద్యార్థులకు శిక్షణ ఇవ్వటం అరుదైన విషయమన్నారు. తమ విద్యార్థులు ఆలిండియా రేడియో కార్యక్రమంలో అద్భుతంగా ప్రదర్శించి ప్రసార భారతి ద్వారా నగదు పారితోషకాన్ని అందుకున్నారని చెప్పారు. ఏ పాఠశాలలో లేని విధంగా అంతర్జాతీయ ప్రమాణాలతో ఇంగ్లీష్ మాట్లాడించడానికి స్కూల్‌లోనే ఒక వాయిస్ రికార్డింగ్ స్టూడియో నిర్మించామని తెలిపారు. కె-రిడ్జ్‌లో అత్యుత్తమ ప్రమాణాలతో ప్రపంచ స్థాయి ప్రతిభా శిక్షణ ఇస్తున్నట్లు ప్రిన్సిపల్ బర్నబాస్ చెప్పారు. కార్యక్రమంలో క్యాంపస్ ఇన్‌ఛార్జి కోట బాపూజీ, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



జిల్లా కలెక్టర్ కు వినతిపత్రం ఇస్తున్న నాగేశ్వరరావు తదితరులు

పేదలకు స్థలమిచ్చి ఇల్లు కట్టించాలి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా: ఇల్లులేని ప్రతిఒక్కరికీ ఇంటి స్థలం కేటాయించి ఇల్లు నిర్మించి ఇవ్వాలని, సూపర్-6 హామీలను అమలు చేయాలని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎం.నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం నరసరావుపేట పట్టణంలో సిపిఐ కార్యాలయం నుండి ర్యాలీ నిర్వహించి జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబుకు వినతిపత్రం అందజేశారు. నాగేశ్వరరావు మాట్లాడుతూ పట్టణాల్లో 2 సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో 3 సెంట్లు చొప్పున పేదలకు ఇళ్ల స్థలం ఇవ్వాలని, ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు మంజూరు చేయాలని కోరారు. టిడ్కో గృహాల్లో మౌలిక వసతులు ఏర్పాటు చేసి అర్హులకు అందించాలన్నారు. కార్యక్రమంలో సిపిఐ పల్నాడు జిల్లా కార్యదర్శి మారుతి వరప్రసాద్, నాయకులు షేక్ హుస్సేన్, కె.రాంబాబు, బి.శ్రీనివాసరావు, యు.రాము పాల్గొన్నారు.

ప్రతి ప్రశ్నకూ సైన్సుతోనే సమాధానం

ప్రజాశక్తి-సత్తెనపల్లి

అనేక సమస్యలకు కృత్రిమమేధ పరిష్కారం చూపేదిగా ఉందని, దానిపై పరిశోధనలకు ప్రభుత్వాలు తగిన ప్రోత్సాహాన్ని అందించాలని నలంద ఇంజినీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ శ్రీనివాస్ కుమార్ అన్నారు. స్థానిక హోలీ ఫ్యామిలీ స్కూల్లో స్పేస్ సర్ ఎక్స్‌పో-2025ను శనివారం ప్రారంభించిన ఆయన హెచ్‌ఎం విజయ రాణి అధ్యక్షత వహించిన సభలో మాట్లాడుతూ సైన్స్ ప్రతిజీవికీ సంబంధించిందని, ప్రతి ప్రశ్నకు సైన్సులోనే సమాధానం దొరుకుతుందని చెప్పారు. మారుతున్న సమాజాన్ని కనుగుణంగా శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని మరింత అభివృద్ధి చెయడం ద్వారానే సమాజం ఈ స్థితిలో ఉందని చెప్పారు. డిఎన్ఆర్ ఫౌండేషన్ అధినేత దరువూరి నాగేశ్వరరావు, ప్రముఖ న్యాయవాది డి.బాపయ్య చౌదరి,



నమూనాలపై విద్యార్థులతో మాట్లాడుతున్న శ్రీనివాస్‌కుమార్

పాఠశాల కరస్పాండెంట్ సిస్టర్ ట్రీసా మాట్లాడుతూ విద్యార్థులలో శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని, సృజనాత్మకతను వెలికి తీసేందుకు ఇలాంటి సైన్స్ ఎగ్జిబిషన్లు దోహదం చేస్తాయన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు రూపొందించిన నమూనాలను అతిథులు పరిశీలించి అభినందించారు.

వక్తృత్వంలో దివ్యశ్రీ ప్రథమం

ప్రజాశక్తి - పెదకూరపాడు : ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం సందర్భంగా పల్నాడు జిల్లా స్థాయిలో నరసరావుపేటలో జరిగిన వక్తృత్వ పోటీల్లో మండలంలోని 75 త్యాళ్ళూరు జెడ్‌పి పాఠశాల ఏడవ తరగతి విద్యార్థిని కె.దివ్యశ్రీ ప్రథమ స్థానం సాధించినట్లు హెచ్‌ఎం ఎ.శ్రీనివాసరావు తెలిపారు. విద్యార్థినితోపాటు శిక్షణిచ్చిన సాంఘికశాస్త్ర ఉపాధ్యాయులు కె.కోటేశ్వరరావు, రమేష్‌ను అభినందించారు.

పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యం : పెమ్మసాని

ప్రజాశక్తి-పెదకాకాని

పరిసరాల పరిశుభ్రతకు ప్రతి ఒక్కరూ ప్రాధాన్యత ఇవ్వాలని కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ కోరారు. గుంటూరు-కాకాని రోడ్డులో ఆటోనగర్ వద్ద వై జంక్షన్ దగ్గర జాతీయ రహదారి పరిశుభ్ర కార్యక్రమంలో కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, నగర కమిషనర్ పులి శ్రీనివాసులు, ఎంఎల్ఏ నసీర్ అహ్మద్, ఏపిఐడిసి చైర్మన్ డేగల ప్రభాకర్, జాయింట్ కలెక్టర్ భార్గవ తేజ, జిఎంసి డిప్యూటీ మేయర్ షేక్ సజిలా, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు, అధికారులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ప్రజారోగ్యానికి క్యాన్సర్ వంటి వ్యాధుల కారకంగా అత్యంత ప్రమాదకరంగా మారిందని, ప్రజలు, ప్రభుత్వం సంయుక్త కార్యాచరణ ద్వారానే దీనిని అడ్డుకోగలమన్నారు. స్వచ్ఛమైన భూగర్భ జలాలను కూడా ప్లాస్టిక్ భూతం కలుషితం చేస్తుందన్నారు. రాజకీయ పార్టీల నాయకులు కూడా తమ ప్రచార సభల్లో ప్లాస్టిక్ వినియోగం నిషేధించుకొని ఆదర్శంగా ఉండాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. ప్రధాన మంత్రి, ముఖ్యమంత్రి స్థాయిలో ప్లాస్టిక్ నిషేధం, స్వచ్ఛతపై ప్రత్యేక దష్టిసారించారన్నారు. ప్రతి ఇంటిలో, కమర్షియల్ సంస్థల్లో డస్ట్ బిన్లు ఏర్పాటు చేసుకోవడం, ప్రజారోగ్య కార్మికులు సేకరించిన వ్యర్థాలను డంపింగ్ యార్డ్ కి తరలించి, ప్రాసెస్ చేయడం ద్వారా గుంటూరు నగరాన్ని క్లీన్ నగరంగా తీర్చిదిద్దుకోవచ్చున్నారు. నగర కమిషనర్ మాట్లాడుతూ స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్రతి నెల 3 శనివారం ఒక థీమ్‌తో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహిస్తుందన్నారు. ప్రస్తుతం సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేదంపై ప్రజలకు అవగాహన కల్గించాలని నినాదం ఇచ్చారన్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేదంపై ఇప్పటికే జిఎంసి ఏప్రిల్ 1 నుండిసంపూర్ణంగా అమలు చేయడానికి కార్యాచరణ సిద్దం చేశామన్నారు. జాతీయ రహదారి వెంబడి ప్లాస్టిక్ వ్యర్థాలను కూడా ప్రణాళికాబద్దంగా శుభ్రం చేస్తున్నామని తెలిపారు. నగరంలో వార్డ్ సచివాలయాల వారీగా ప్రజలను, ప్రజా ప్రతినిధులను భాగస్వాములను చేస్తూ స్వర్ణాంధ్ర,స్వచ్ఛాంధ్ర కార్యక్రమం చేపట్టామన్నారు. శాసనసభ్యులు నశీర్ మాట్లాడుతూ స్వచ్ఛతపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టి సారించాయన్నారు. మొక్కల పెంపకం, పర్యావరణహిత వస్తువుల వినియోగంపై ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. అనంతరం విద్యార్థులు, అధికారులతో స్వచ్ఛత ప్రతిజ్ఞ చేయించి, జాతీయ రహదారి వెంబడి వ్యర్థాలను వారితో కలిసి శుభ్రం చేశారు. ఆటోనగర్ నుండి అగతవర్రపాడు డొంకను



పరిశీలించి, గడ్డిపాడు రైల్వే గేటుకు ప్రత్యామ్నాయ రహదారిగా ఉంటుందని, రోడ్డు ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని జిఎంసి ఎస్ఈని ఆదేశించారు కార్యక్రమంలో కార్పొరేటర్లు రిహాన పఠాన్, ముప్పవరపు భారతి, పి.సమత, అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, డిప్యూటీ కమిషనర్లు సిహెచ్.శ్రీనివాస్, టి.వెంకట కష్ణయ్య, ఎస్ఈ నాగ మల్లేశ్వరరావు, సిటి ప్లానర్ రాంబాబు, ఎంహెచ్ఓ డాక్టర్ రవిబాబు, భాష్యం రామక్రిష్ణ, సిమ్స్ భరత్ రెడ్డి, అధికారులుపాల్గొన్నారు.

మా ఊరు రండి సార్..

మంత్రి లోకేష్‌కు ఫారెస్ట్ ప్రాంత వాసుల ఆహ్వానం

ప్రజాశక్తి - తాడేపల్లి

స్వచ్ఛ ఆంధ్ర ప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా మా ఊరు రండి సార్ అంటూ తాడేపల్లి పట్టణంలోని ఫారెస్ట్ ప్రాంత వాసులు స్థానిక ఎమ్మెల్యే మరియు మంత్రి నారా లోకేష్ ను ఆహ్వానించారు. తాము ఇక్కడ నివాసం ఉండి 30 ఏళ్లు పై గడిచిన నేటికీ ఇళ్ళ ముందు డ్రైనేజీ లేక అవస్థలు పడుతున్నట్లు వాపోయా రు. ఎల్లమందు మట్టిరోడ్లే గతి అయ్యాయని అసంతప్తి వ్యక్తం చేశారు. అనేక ప్రభుత్వాలు మారిన తమ ఇళ్ళ ముందు పరిస్థితి మాత్రం మారలేదని వాపోయారు. గెలిచిన ప్రతి ఒక్కరూ ఇక్కడ అభివద్ధిని నిర్లక్ష్యం చేశారు. టిడిపి గెలిస్తే ఫారెస్ట్ ప్రాంతంలో నివాసం ఉంటున్న వారందరికీ పెట్టాలి ఇవ్వటంతో పాటు మౌలిక సౌకర్యాలు కల్పిస్తామని ఎన్నికలకు ముందు మీరు ఇచ్చిన వాగ్దానాన్ని గుర్తు చేస్తున్నాం. స్వచ్ఛ ఆంధ్ర - కార్యక్రమంలో భాగంగా మీరు మా ప్రాంతానికి వచ్చి మా ఇబ్బందులు తీర్చాలని కోరుకుంటున్నాం. ఆ మేరకు శనివారం 12వ వార్డు శశివాలయం స్థానికులతో కలిసి సిపిఎం నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ నాయకులు వేముల దుర్గారావు, అడ్డగట్ల చెవిరి భర్తలో, ఎం మల్లేశ్వరి, ఎన్ తులసమ్మ, జి కాశి, వీరయ్య, శీను, మాంబి, ఫాతిమా, వేముల వెంకన్న, ఎన్ సాయి తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ

ప్రజాశక్తి - తాడేపల్లి

మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని తాడేపల్లి బ్రహ్మానందపు రంలోని కె.సి.డబ్ల్యూ. ఈ.ఈ.ఎస్. హై స్కూల్ లో పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు రాస్తున్న విద్యార్థినీ విద్యార్థులకు తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి వడ్డేశ్వరపు స్టాలిన్ ఆర్థిక సహకారంతో జామెంట్రీ బాక్సులు, పరీక్ష ప్యాడ్లు పంపిణీ చేశారు.అలాగే సాయంత్రం పూట స్టడీ అవర్స్ సందర్భంగా ఒక నెల భోజనం ఏర్పాటు చేస్తున్నట్లు అలాగే నెల రోజులపాటు స్నాక్స్ అందిచడం జరుగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమానికి హెడ్ మాస్టర్ రామలింగేశ్వరరావు, పద్మావతి, పూర్వ విద్యార్థులు వడ్డేశ్వరపు స్టాలిన్, ఉప్పు నాగరాజు, అజయ్ కుమార్, నాగరాజు, మనోహర్,రవి, పాల్గొన్నారు.

వైసిపి సోషల్ మీడియా సెక్రెటరీగా వెంకట్‌రెడ్డి



ప్రజాశక్తి - తాడేపల్లి : వైసిపి రాష్ట్ర సోషల్ మీడియా సెక్రెటరీ తాడేపల్లి పట్టణానికి చెందిన మేక వెంకట్రామిరెడ్డిని నియమి ంచారు. ఈ సందర్భంగా బైపాస్ రోడ్డు వైసిపి కార్యాలయంలో ఏం ప్రకాష్ ఆధ్వర్యంలో శాలువాగప్పి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో బుర్ర ముక్కు వేణుగోపాల్ స్వామి రెడ్డి, మున్నంగి వివేకానంద రెడ్డి, ముదిగొండ ప్రకాష్, ఉప్పు శీను, భక్తుల దాసు, ఎన్ షణ్ముఖ తదితరులు పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో బత్తాయి తోట దగ్ధం

ప్రజాశక్తి - విజయపురిసౌత్

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో బత్తాయి తోట దగ్ధమైన సంఘటన ఆలస్యంగాగా వెలుగులోకి వచ్చింది. మాచర్ల మండలం చింతల తండా కు చెందిన రైతు అంగోత్ మోతిలాల్ తన 4 ఎకరాల్లో 2018 సంవత్సరం నుంచి బత్తాయి తోట వేసి సాగు చేసుకుంటున్నాడు. ఆదివారం మోటార్ బోర్ వద్ద విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరగడంతో మంటలు చెలరేగి బత్తాయి తోట కు అంటుకున్నాయి.హుటా హుటిన స్థానికులతో కలిసి నీళ్లు చల్లి మంటలు ఆర్పే ప్రయత్నం చేశారు. అప్పటికే ఒక ఎకరం వరకు బత్తాయి తోట పూర్తిగా దగ్ధమైందని రైతు తెలిపారు. రూ.మూడు లక్షల నష్టం జరిగిందని బాధితుడు పేర్కొన్నారు.

వేద విద్యాలయంలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

శ్రీ శృంగేరి శారదా పీఠం ఆధ్వర్యంలోని, పల్నాడు జిల్లాలోని మాదిపాడు గ్రామంలో గల వేద వేదాంత గురుకుల మహా విద్యాలయంలో వేద విద్యనభ్యసించదలచిన విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారని ధర్మాధికారి ప్రొఫెసర్ డీవీఆర్ శేషాద్రి ప్రకటించారు. శనివారం ఎంటిఎంసి పరిధిలోని కుంచనపల్లి శ్రీ ఫార్చ్యున్ గ్రాండ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన ఈ ప్రకటన చేశారు.వేద విద్యను అభ్యసించదలచిన వారు 99630 57025 నంబరు ద్వారా వాట్సాప్ సందేశం పంపగలరని కోరారు.



102 రోజుకు ఎసిసి కార్మికుల దీక్షలు

ప్రజాశక్తి- తాడేపల్లి : చట్టపరంగా, న్యాయంగా తమకు రావలసిన బకాయిల కోసం ఏ సి సి మెంట్ ఫ్యాక్టరీ కార్మికులు చేస్తున్న దీక్షలు శనివారం నాటికి 102 రోజుకు చేరుకున్నాయి. దీక్షలో వై యెహోషువ, ఎన్ సుబ్బారావు, వై సాంబశివరావు, కె హగ్గయ్య, ఎం గురవయ్య కూర్చున్నారు. దీక్షలను సిఐటియు తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు, యూని యన్ నాయకులు కూరపాటి స్టీవెన్, కొర్రపాటి ఆదినారాయణ ప్రారంభించారు. సందర్భంగా వారు మాటా్లడుతూ కార్మికులకు ఫ్యాక్టరీ యాజమా న్యానికి మధ్య మంచి వాతావరణం లో చర్చలు జరిపి సమస్య పరిష్కారం అయ్యేందుకు ప్రభుత్వం చొరవ చూపించాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఆ దిశగా ముఖ్యమంత్రి చర్యలు తీసుకోవా లని ఆకాంక్షి ంచారు. ఈ కార్యక్రమ ంలో ఎం ఆశీర్వాదం, ఆర్ ఇజ్రాయిల్, వై సుబ్బా రావు, ఎం నాగేశ్వరరావు, బి ఏసుబాబు, ఎస్.కె ఇమంబి, సిహెచ్ చిన్న పున్నారావు, ఎం శివకు మారి, వై రమాదేవి, ఎం శారద, బి సామ్రాజ్యం, యు రమణ, డి బేబమ్మ, వి రేణుక, యు కాశమ్మ, వి లక్ష్మి, డి రమణ, అంకమ్మ పాల్గొన్నారు

మహారాజ శ్రీ పొదిలి జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

ఓ.ఎస్. నెంబర్ :132/2024

గుంటూరు నాగిరెడ్డి ...వాది

వర్సెస్

పల్లు రాంబాబు ...ప్రతివాది

To

పల్లు రాంబాబు తండ్రి సోమేశ్వరరావు,
వయస్సు 38 సం. R/o బ్యాంక్ కాలనీ
పొదిలి గ్రామం & మండలం,
ప్రకాశం జిల్లా.
ప్రస్తుతం నివాసము : సంగడిగుంట,
గుంటూరు సిటీ, గుంటూరు జిల్లా.

అనువారికి పై నెంబరు దావాలో నీ హాజరు నిమిత్తం పై కోర్టు వారు నీకుసార్లు నోటీసులు పంపించినను జారీ కానందున శ్రీ కోర్టు వారు నీ నోటీసు నిమిత్తం వాయిదా తే.01-04-2025ది న అయి ఉన్నది. కావున పై తేదీన ఉదయం గం.10-30 ని.లకు నీవు స్వయంగా గాని, ప్లీడర్ గారి ద్వారా కానీ శ్రీ కోర్టు వారి ఎదుట హాజరై నీ ఆక్షేపణలు తెలుపుకొనగలరు. లేనిచో నీపరోక్షమున తీర్మానించ బడునని ఇందుమూలముగా తెలియపరచ డమైనది.

// శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //

వాయిదా తేదీ :01-04-2025

తేదీ:13-03-2025 ఇట్లు

బోడిగారి వెంకటేశ్వర్లు, బి.ఏ.ఎల్.ఎల్.బి,
అడ్వకేట్,
పొదిలి, ప్రకాశం జిల్లా.
సెల్ :9985436688.

IN THE COURT OF THE PRINCIPAL SUSSIONS AND DISTRICT JUDGE : GUNTUR
CrIMP 773/2023 in
Crl.Appeal No. /2025

Between :
Ganupalli Prabhavathi .... Petitioner / Appellant
And
Ganupalli Koteswara Rao and others .... Respondent / Respondents

To,
1) గనుపల్లి కోటేశ్వరరావు, తండ్రి : నాగేశ్వరరావు, 40 సం॥లు, మొక్కపాడు గ్రామం, రాజుపాలెం మండలం, పల్నాడుజిల్లా.
2) గనుపల్లి కిలారమ్మ, భర్త : నాగేశ్వరరావు, 52 సం॥లు, మొక్కపాడు గ్రామం, రాజుపాలెం మండలం, పల్నాడుజిల్లా.
3) గనుపల్లి నాగేశ్వరరావు, తండ్రి : కోటయ్య, 54 సం॥లు, మొక్కపాడు గ్రామం, రాజుపాలెం మండలం, పల్నాడుజిల్లా.
4) పాలకిట్టి కోటేశ్వరమ్మ, భర్త : కొండయ్య, మొక్కపాడు గ్రామం, రాజుపాలెం మండలం, పల్నాడుజిల్లా.

పై నెంబరు పిటీషన్ నందు 1,2,3 మరియు 4వ ప్రతివాదులు అయిన మీకు పై కోర్టువారి నుండి నోటీసులు పంపినను మీరు తీసుకొనక పోవడం వలన ఈ పేపరు ప్రకటన ద్వారా నోటీసులు పంపవలసినదిగా శ్రీ కోర్టువారు ఆర్డరు వేసియున్నారు. ది. 10-4-2025వ తేదీన వాయిదా అయివున్నది. కావున ఆ రోజున ఉదయం 10-30 గం.లకు పై కోర్టువారి ముందు మీరు స్వయంగా గానీ, మీ లాయరుగారి ద్వారా గానీ హాజరై మీకు గల ఆక్షేపణలను తెలుపుకొనగలరు. లేనిచో శ్రీ కోర్టువారిచే చట్ట ప్రకారం తీర్మానించబడును.

(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం)

వాయిదాతేది : 10-4-2025)

రీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్స్
డి.ఎల్.ఎస్.ఎ., గుంటూరు.

దావా సమను

(C.P.C. Order 5 Rule 1 & 5)

మహారాజశ్రీ

మార్కాపురం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

O.S. 257/2022

Poreddy Chenchi Reddy . .... Plaintiff
Vs
Shaik Ameen Basha .... Defendant

To :-
Shaik Ameen Basha,
S/o.Peeran @ Shaik Saheb Peeran,
Aged 54 years, Senior Assistant,
Working in Health Department,
Resident of 28-1-78, Plot No.102, Midcity Homes, 14th Cross Road,
Opp. R.D.O. Office, Kankaragunta,
Guntur Town and District, Pin : 522004,
Cell No.8143333536.

పై నెంబరు దావాలోని, వాది దావా పరిహారం నిమిత్తం అనగా వాది వద్ద నీవు 27-05-2018వ తేదీన రూ.1,00,000/-, 28-05-2018వ తేదీన రూ. 1,00,000/- మరియు 29-05-20218వ తేదీన రూ. 1,00,000/- నగదు తీసుకుని బాకీపడి వాది పేర3 ప్రామిసరీ నోట్లు స్వహస్తముతో వ్రాసియిచ్చి బాకీ చెల్లించనందున పై కోర్టులో, పై నెంబరున నీపైన వాది దావా దాఖలు చేసియున్నాడు. ఇందు విషయమై నీకు పలుమార్లు దావా సమన్లు పంపగా అవినీకు ముట్టని కారణం చేత ఈ దినపత్రిక దావాసమను ద్వారా నీకు తెలియ జేయునది ఏమనగా 27-03-2025వ తేదీన ఉదయం 10:30 గంటలకు పై కోర్టులో నీవు స్వయముగా గానీ, అడ్వకేట్ ద్వారా గానీ హాజరై నీకు ఏమైనా ఆక్షేపణలు ఉన్న యెడల తెలియజేసుకొనవలసినది. లేని యెడల నీ పరోక్షమందు దావాను విచారించి తీర్మానించబడును.

// కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //

వాయిదా: 27-03-2025
మార్కాపురం

K.V.Narayana Reddy,
Advocate for Plaintiff,
Markapur, Prakasam District.
Cell No.9948822599.

దావాసమను

ఒంగోలు 3వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో

O.S.No. 36/2016

చీమలమర్రి శ్రీరామమూర్తి, వగైరాలు - వాదులు

వర్సెస్

చీమలమర్రి కృష్ణ ప్రసాద్, వగైరా - ప్రతివాదులు

To,
D27). **Mirampalli Chinnakka,**
S/o **Mirampalli Chenna Krishnaiah,**
34 years, Hindu, R/o D.No. 18-6-264, Kothapeta, Tammareddy Nagar, 1st Line, Patha Guntur, Guntur District.

యీ నంబరులోని వాదులు షెడ్యూలు దావా ఆస్తులను బాగా పంపిణీ చేయవలసిందిగా కోరుచూ మీ వగైరాలపై దావా చేయగా మీ నోటీసు నిమిత్తం **తేది: 24.03.2025** కి వాయిదా వేసినారు కావున వాయిదా రోజున మీరు స్వయంగా గాని అడ్వకేట్ గారి ద్వారా గాని పై కోర్టులో **ఉదయం 10:30** కి హాజరై మీ గల ఆక్షేపణలు తెలుపుకొనవలెను లేనియెడల మీ పరోక్షముందు తీర్మానించబడునని తెలియజేయడమైనది.

శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు

ఇట్లు

చీమలమర్రి వెంకట సుబ్రహ్మణ్య రవీంద్రకుమార్
Plaintiff-2

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సివిల్‌జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో, సత్తెనపల్లి.

O.S. No. 620/2022

బిట్వీన్ :
దగ్గుబాటి జగన్నాధం ..... వాది
అండ్
సోమేపల్లి నరసింహారావు ... ప్రతివాది

టు,
సోమేపల్లి నరసింహారావు, తండ్రి : పున్నయ్య, నివాసం : డోర్ నెం. 15-10-11, వడ్డవల్లి, సత్తెనపల్లి టౌన్ మరియు మండలం, పల్నాడుజిల్లా.

పై నెంబరు గల దావాలో వాది మీపై ప్రామిసరీ నోటు బాకీ నిమిత్తం దావా దాఖలు చేయగా మీకు కోర్టు ద్వారాను, పోస్టు ద్వారాను సమన్లు పంపియున్నారు. మీరు తీసుకొనకుండా కాలయాపన చేయుచున్నందున శ్రీ కోర్టువారు మీ యొక్క హాజరు నిమిత్తం ది. 17-03-2025న వాయిదా వేసియున్నారు. ఆ రోజున మీరు స్వయంగా గానీ, వకీలు ద్వారా గానీ హాజరై మీ యొక్క ఆక్షేపణలు తెలియజేయవలసినదిగా యిందు మూలంగా తెలియజేయడమైనది. లేనిచో మీపై పరోక్షంగా తీర్మానించబడును. ఇందుమూలంగా తెలియ జేయడమైనది.

(కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం)

వాయిదాతేది : 17-03-2025

ఇట్లు
శ్రీ పి.వి. నరసింహశాస్త్రి,
వాది తరపు న్యాయవాది,
సత్తెనపల్లి.

కోర్టు నోటీసు

ప్రిన్సిపల్ సివిల్ జడ్జ్ (జూనియర్ డివిజన్) నందిగామ వారి కోర్టులో

ఓ.ఎస్.నంబర్.79/2024

బిట్వీన్ :
పెద్ది నాగరాజకుమారి .... వాది
మరియు
నెలకుర్తి శివకుమారి మరియు ఇతరులు ... ప్రతివాదులు

3వ ప్రతివాది : దొండపాడు గ్రామం, తుళ్లూరు మండలం, గుంటూరు జిల్లా.

పై నెంబరు దావాలో 3 వ ప్రతివాది అయిన మీకు పలుమార్లు దావా సమన్లు పంపినప్పటికిని మీరు పై కోర్టు వారి ఎదుట హాజరుకానందున, మీరు ది 18.03.2025 తేదీన ఉదయం గం.10:30 ని. లకు మీరు స్వయంగా గాని లేక మీ ప్లీడర్ గారి ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకొనగలరు, లేనియెడల మీ పరోక్షములో తగిన ఉత్తర్వులు జారీ చేయుదురు అని ఇందుమూలంగా తెలియజేయడమైనది.

(శ్రీ కోర్టు వారి అనుమతితో)

వాయిదా తేదీ: 18.3.2025

షేక్ సైదా, న్యాయవాది
నందిగామ -521185
సెల్. 98493 83906

కంటి వైద్యంపై చిన్నచూపు

- నిలిచిన సేవలు - గదికి తాళం
- పరికరాలను తీసుకెళ్లిన అపోలో సంస్థ
- సామాన్యులకు తప్పని అవస్థలు
- ప్రైవేటు ఆస్పత్రుల్లో రూ.వేలకువేలు పెట్టలేక వైద్యానికి దూరం




చిలకలూరిపేట పట్టణంలోని ఏరియా ఆస్పత్రి... మూతబడ్డ కంటి వైద్య విభాగం గది

ప్రజాశక్తి - చిలకలూరిపేట

కంటి వైద్యం కోసం వచ్చేవారితో కిటకిటలాడిన గదులు ఇప్పుడు మూతబడి ఉన్నాయి. మొన్నటి వరకూ ప్రభుత్వ వైద్యసేవలను ఉచితంగా పొందిన సామాన్యులు ఇప్పుడు అప్పులు చేసి ప్రైవేటు ఆస్పత్రులు, క్లినిక్కుల్లో ఫీజులు చెల్లించుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. అపోలో సంస్థతో చేసుకున్న ఒప్పందంలో భాగంగా 'కంటి వెలుగు' పేరుతో స్థానిక ఏరియా ఆస్పత్రిలో కంటి వైద్యం, చికిత్సలను గతంలో నిర్వహించేవారు. ఇందుకుగాను స్థానిక ఏరియా ఆస్పత్రిలో ఒక గదిని కేటాయించి కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ విధానంపై డాక్టర్, సిబ్బందిని నియమించారు. ఆధార్ కార్డు తీసుకెళ్లి ఓపీ రాయించుకుంటే కంటి పరీక్షలు నిర్వహించి మందులు, కళ్లజోళ్లు ఇచ్చేవారు. అవసరమైన వారికి కంటి ఆపరేషన్లు కూడా చేసేవారు. వీలైనంత వరకు స్థానికంగా వైద్యచేసేవారు. లేకుంటే పెద్దస్పత్రులకు సిఫార్సు చేసేవారు. ఇలా నెలకు దాదాపు 2 వేల మంది వరకూ కంటి వైద్యసేవలు పొందేవారు. చిలకలూరిపేట పట్టణంతోపాటు చుట్టుపక్కల గ్రామాల నుండీ ప్రతినెలా వందల సంఖ్యలో పేదలు వచ్చేవారు. అయితే ఫిబ్రవరిలో అపోలో సంస్థతో ఒప్పందం కాలం ముగియడంతో కంటి వైద్యసేవలు అర్ధాంతరంగా నిలిచాయి. ఆ విభాగానికి కేటాయించిన గది కూడా మూతబడింది. ఆ గదిలోని వైద్య పరికరాలు, కంప్యూటర్లు, ఇతర సామగ్రిని కాంట్రాక్టు సంస్థ తీసుకెళ్లింది.

ఆశగా వచ్చి.. నిరాశతో వెనుదిరిగి..

ప్రతిరోజూ పదుల సంఖ్యలో కంటి రోగులు పట్టణంలోని ఏరియా ఆస్పత్రికి వస్తున్నారు. తీరా కంటి విభాగం మూతబడిందని తెలిసి నిరాశతో వెనుదిరుగుతున్నారు. వీరిలో పిల్లలు, మహిళలు, వృద్ధులు అన్ని వయస్సుల వారూ ఉంటున్నారు. వీరంతా తప్పనిసరి పరిస్థితుల్లో ప్రైవేటు ఆస్పత్రులు, క్లినిక్‌లను ఆశ్రయిస్తున్నారు. ఇక్కడ ఓపీకే రూ.300 అవుతుండగా ఇతర పరీక్షలు, మందులు, కళ్లజోళ్లకు రూ.వెయ్యి నుండి రూ.రెండు వేల వరకూ ఖర్చు చేయాల్సి రావడం పేదలు, ప్రత్యేకించి వృద్ధులకు ఆర్థిక భారంగా మారింది. ఈ ఖర్చులను భరించలేని వైద్యం ఆలోచనే మానుకుంటుండగా మరికొంతమంది స్వచ్ఛంద సంస్థలు ఉచిత వైద్యశిబిరాలు ఎక్కడైనా పెడతాయేమోనని వాకబు చేసుకుంటున్నారు. ఈ పరిస్థితులను కూటమి ప్రభుత్వం గమనించి వైద్యసేవలను పునరుద్ధరించాలనే డిమాండ్ ప్రజల నుండి వ్యక్తమవుతోంది.

ఇంటర్ దూరవిద్య పరీక్షలకు 90 శాతం హాజరు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

దూరవిద్య ఇంటర్మీడియట్ పరీక్షలు పల్నాడు జిల్లాలో 9 కేంద్రాల్లో నిర్వహించగా శనివారం ప్రశాంతంగా ముగిశాయని జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ తెలిపారు. శనివారం జరిగిన చివరి పరీక్షలకు (జీవశాస్త్రం - వాణిజ్య శాస్త్రం) 947 మందికిగాను 848 మంది (90 శాతం) హాజరైనట్లు చెప్పారు. పరీక్ష కేంద్రాలను తనిఖీకి 5 సిట్టింగ్ స్క్వాడ్‌లను, 2 ఫ్లయింగ్ స్క్వాడ్‌లను ఏర్పాటు చేశామని, నరసరావుపేట, వినుకొండ, సత్తెనపల్లిలోని 5 పరీక్షా కేంద్రాలను తనిఖీ చేయగా మాస్ కాపీయింగ్ ఎక్కడా జరగలేదని తెలిపారు.

ప్రశాంతంగా ముగిసిన పరీక్షలు

ప్రజాశక్తి - కారంపూడి

కారంపూడి పట్టణంలోని బిషప్ భాగ్య జాన్ క్రిస్టియనా జూనియర్ కాలేజీలో జరుగుతున్న ఇంటర్మీడియట్ పరీక్షలు శనివారంతో ప్రశాంతంగా ముగిశాయని చీఫ్ సూపరింటెండెంట్ వి.బాలు నాయక్ తెలిపారు. మొదటి సంవత్సరం విద్యార్థులు 285 మందికిగాను 277 మంది హాజరయ్యారని, ద్వితీయ సంవత్సరం 177 మందికిగాను 175 మంది హాజరయ్యారని వివరించారు. సిసి కెమెరాల నిఘాలో పకడ్బందీగా పరీక్షలు నిర్వహించామన్నారు.

మోడల్ స్కూల్, కాలేజీలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి - కారంపూడి : మండల కేంద్రమైన కారంపూడిలోని ఏపీ మోడల్ స్కూల్, జూనియర్ కాలేజీలో 2025-26 విద్యా సంవత్సరానికి ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ నయోమి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 17 నుంచి మే నెల 22 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని, 6వ తరగతిలో ప్రవేశానికి ఈ నెలాఖరుకు గడువు ముగుస్తుందని తెలిపారు. వివరాలకు 9441422431ను సంప్రదించాలని సూచించారు.

24, 25 తేదీల్లో బ్యాంకుల సమ్మె

ప్రజాశక్తి - మాచర్ల రూరల్ :

సమస్యల పరిష్కారం కోసం బ్యాంక్ ఉద్యోగ సంఘాలు ఈ నెల 24, 25 తేదీల్లో సమ్మెకు పిలుపునిచ్చాయి. 9 సంఘాలు యునైటెడ్ ఫోరమ్ ఆఫ్ బ్యాంక్ యూనియన్స్‌గా ఏర్పడి తమ కార్యాచరణ చేపట్టాయి. దీనిపై యూనియన్ స్థానిక నాయకులు మాట్లాడుతూ బ్యాంకింగ్ రంగంలో పర్మినెంట్ పోస్టుల్లో ఔట్ సోర్సింగ్ నియమకాలు చేయటాన్ని వ్యతిరేకించారు. అన్ని కేడర్లలో ఖాళీగా ఉద్యోగాలను భర్తీ చేయాలని తమ ప్రధాన డిమాండ్‌గా చెప్పారు. ఇప్పటికే తాత్కాలిక ఉద్యోగులుగా పనిచేస్తున్న వారిని పర్మినెంట్ చేయాలని కోరారు. వారానికి 5 రోజుల పని దినాలను అమలు చేయాలన్నారు. డిఎఫ్‌ఎస్ ఆదేశాల వల్ల ఉద్యోగ భద్రతకు ముప్పు ఉన్న నేపథ్యంలో సదరు ఆదేశాలను ఉపసంహరించాలని కోరారు. ప్రభుత్వ బ్యాంకింగ్ రంగాన్ని రక్షించే చర్యలు చేపట్టాలని, సిబ్బంది ప్రయోజనాలు కాపాడాలని కోరుతూ పలుమార్లు జరిపిన చర్చలు విఫలమవడంతో సమ్మెకు పిలుపునిచ్చామన్నారు. సమ్మెకు గల కారణాలను ఖాతాదారులు అర్థం చేసుకుని మద్దతు తెలపాలని, సహకరించాలని కోరారు.

పగలు ఎండ.. రాత్రి మంచు

ప్రజాశక్తి-చిలకలూరిపేట : కొద్దిరోజులుగా చిలకలూరిపేట ప్రాంతంలో ప్రత్యేక వాతావరణ పరిస్థితులు నెలకొన్నాయి. పగటి పూట ఎండలు మండి పోతుండగా.. అర్ధరాత్రి తర్వాత నుండి తెల్లవారుజాము వరకు మంచు పడుతోంది. ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించనంతగా మంచు ఉంటోంది.



తాగునీటి సమస్యను రానివ్వొద్దు : ఎమ్మెల్యే పుల్లారావు

ప్రజాశక్తి-చిలకలూరిపేట



ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వ ప్రయత్నాలు ఫలించాలంటే అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండాలని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన గ్రీవెన్స్‌లో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించిన ఎమ్మెల్యే వాటి పరిష్కారానికి అప్పటికప్పుడే ఆదేశాలిచ్చారు. అర్జీల్లో ఎక్కువగా రహదార్లపై గుంతలు, డ్రెయినేజీల నిర్మాణం, తాగునీటి సమస్యలకు సంబంధించిన ఉన్నాయని చెప్పారు. చేపల మార్కెట్ నిర్మాణ ప్లాన్ త్వరగా సిద్ధం చేయాలన్నారు. శివారు కాలనీలకు తాగునీరు అందించాలని, ఎక్కడా ఇబ్బందులు రాకూడదని చెప్పారు. పట్టణంలో కుక్కల సంచారం లేకుండా చూడాలని, వీధికుక్కల్ని పట్టి, జనావాసాలకు దూరంగా తరలించాలని సూచించారు. కార్యక్రమం చైర్మన్ షేక్ రఫానీ, కమిషనర్ శ్రీహరి, డిఈ రహీం, పట్టణ సిఐ రమేష్‌బాబు, మున్సిపల్ కౌన్సిలర్లు పాల్గొన్నారు.



తల్లిదండ్రుల కష్టాలను గుర్తించి చదవండి

ప్రజాశక్తి-ఈపూరు : చదువులో బాగా రాణించి పేదరికాన్ని జయించాలని విద్యార్థినులకు కానిస్టేబుల్ బి.ఆంజనేయులు సూచించారు. స్థానిక ఎస్సీ, ఎస్టీ, బీసీ హాస్టల్లో 40 మంది 10వ తరగతి విద్యార్థులు పరీక్ష సామగ్రిని ఆయన శనివారం పంపిణీ చేశారు. తల్లిదండ్రుల కష్టాలను గుర్తించి చదవాలని, చదువుతో మంచి భవిష్యత్తు ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్లు రాంప్రసాద్, వెంకటేశ్వర్లు నాయక్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పిన్నెల్లి, అనుచరుల అక్రమాలపై సమగ్ర విచారణ

- కుల, మతాల చిచ్చు రాజేస్తే సహించం
- ప్రజాదర్బార్‌కు భూ కబ్జాదార్లు రావొద్దు
- ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి




అర్జీలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి

ప్రజాశక్తి - వెల్దుర్తి

మాచర్ల నియోజకవర్గంలో గత ఐదేళ్లలో పిన్నెల్లి రామకృష్ణారెడ్డి కుటుంబం, ఆయన అనుచరులు వేల ఎకరాలను కబ్జా చేశారని, పలువుర్ని బెదిరించి ఆస్తులను రాయించుకున్నారని, ప్రజలు కోల్పోయిన ఆస్తులు, భూమలపై సమగ్ర విచారణ జరుగుతుందని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. వెల్దుర్తిలోని తన క్యాంపు కార్యాలయంలో శనివారం నిర్వహించిన ప్రజాదర్బార్‌లో ఎమ్మెల్యే మాట్లాడుతూ రెవెన్యూ రికార్డులను ట్యాంపరింగ్ చేసి, నకిలీ పాసు పుస్తకాలను సృష్టించి, రూ.వందల కోట్లు రుణాలను తీసుకుని బ్యాంకులను, రైతులను రామకృష్ణారెడ్డి లూటీ చేశారని, కబ్జాకోరులను జైలుకు పంపి, రైతులకు న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. డ్వాక్రా మహిళలకు తెలియకుండా బ్యాంకు నుంచి పొదుపు డబ్బులు కాజేసిన యానిమేటర్లపై, వారి వెనకున్న వైసిపి నేతలపై కేసులు నమోదు చేసి, విచారణ జరుపుతామన్నారు. కులాలు, మతాల మధ్య చిచ్చు రాజేసి రాజకీయంగా లబ్ధి పొందేవారిని ఉపేక్షించబోమన్నారు. తాజాగా మాచర్ల పట్టణంలో రెండు సామాజిక తరగతుల మధ్య జరిగిన గొడవను రాజకీయంగా ఉపయోగించుకోవడానికి వైసిపి చూస్తోందన్నారు.

ప్రజాదర్బార్‌కు 50 వినతులు

ఇదిలా ఉండగా ప్రజాదర్బార్‌లో ప్రజల నుంచి 50 కు పైగా వినతులను ఎమ్మెల్యే స్వీకరించారు. రెవెన్యూ, భూ కబ్జాలు, పింఛన్లు, సిఎం సహాయనిధి వంటివి రాగా వీటిపై అధికారులతో మాట్లాడి బాధితులకు న్యాయం చేయాలని ఆదేశించారు. ప్రజాదర్బార్ బాధితుల కోసమని, దీనికి కబ్జాకోరులు రావొద్దని అని అన్నారు. గత ప్రభుత్వంలో జరిగిన భూ కబ్జాలు, అవినీతి, అక్రమాలు, దౌర్జన్యాలు, అక్రమంగా ఆస్తులు రాయించుకోవడం వంటి వాటిపై ప్రజా వినతులను స్వీకరించి, విచారణ అనంతరం బాధితులకు న్యాయం చేస్తామని చెప్పారు.



తన వద్దకు వచ్చిన వారితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

మీ కులాల మధ్య గొడవలేమైనా ఉన్నాయా?

ఘర్షణ పై హోం మంత్రి అడిగారు

ప్రజాశక్తి - మాచర్ల

ఇద్దరి మధ్య చిన్న వివాదాన్ని రెండు కులాల మధ్య ఘర్షణగా చేసి వీధుల్లో రాళ్లు, కర్రలతో స్వైర విహారం చేస్తే చూస్తూ ఊరుకోవాలా? అని ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక ప్రభుత్వ వైద్యశాలను శనివారం తనిఖీ చేసిన ఆయన్ను వివాదంలో ఒక పక్షానికి చెందిన వారు కలిసి తమ పిల్లలపై అన్యాయంగా కేసు పెట్టారని చెప్పారు. ఈ రెండు సామాజిక తరగతులకు గతంలో ఏమైనా ఘర్షణలున్నాయా? అని ఎమ్మెల్యే అడిగారు. ఎన్నికల సందర్భంలో కూడా ఇలాగే చిన్న గొడవలను కుల ఘర్షణలుగా మార్చి రాజకీయ లబ్ధి పొందడానికి గత నాయకులు ప్రయత్నించారని అన్నారు. మాచర్లలో మూడ్రోజుల క్రితం జరిగిన ఘర్షణపై హోం మంత్రి కూడా తనకు ఫోన్ చేసి వివరణ అడిగారని చెప్పారు. తమ ప్రభుత్వం ఎవర్నీ తప్పుడు కేసుల్లో ఇరికించదంటూ అక్కడే ఉన్న పట్టణ సిఐ ప్రభాకర్‌ను పిలిచి ఘర్షణలకు పాల్పడిన ఎవర్నీ వదిలిపెట్టొద్దని చెప్పారు.

పారిశుధ్యం, స్వచ్ఛత పట్ల ప్రజల్లో మార్పు రావాలి

చైతన్యం కోసం నియోజకవర్గంలో ఇంటింటికీ ప్రచారం

కార్మికులతో కలిసి చెత్తను ఎత్తివేసిన మంత్రి లోకేష్

ప్రజాశక్తి - మంగళగిరి

పారిశుధ్యం, పరిసరాల పరిశుభ్రత పట్ల ప్రజల్లో మార్పు రావాల్సిన అవసరం ఉందని, ప్రజల్లో చైతన్యం కల్పించేందుకు మంగళగిరి నియోజకవర్గంలో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తామని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా మంగళగిరి ఎయిమ్స్ సమీపంలోని ఎకో పార్క్ లో శనివారం నిర్వహించిన స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. పార్క్‌లో చెత్తను శుభ్రంచేసి స్వయంగా చెత్తకుండీలో వేశారు. ఈ సందర్భంగా పారిశుధ్య కార్మికులతో కలసి టి తాగారు. అనంతరం లోకేష్ మాట్లాడుతు పారిశుధ్య కార్మికులు ప్రజలంతా నిద్రకు ఉపక్రమించిన తర్వాత వారు మేల్కొని పరిసరాలను పరిశుభ్రంగా మారుస్తారని ప్రశంసించారు. మంగళగిరి ఎకో పార్క్ బాగుందని, మరింతగా అభివృద్ధి చేస్తామని చెప్పారు. పారిశుధ్యం, పరిశుభ్రత పట్ల ప్రజల్లో మార్పు రావడం కోసం కూటమి ప్రభుత్వం ప్రతి నెల 3వ శనివారం స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహిస్తుందని చెప్పారు. మంగళగిరిలో భూగర్భ డ్రైనేజీ, అండర్ వాటర్, గ్యాస్, పవర్ అందుబాటులోకి వస్తే చాలా వరకు సమస్యలు తీరిపోతాయి. చెరువుల ఆధునీకరణకు దాదాపు రూ.3కోట్లు వెచ్చిస్తున్నామన్నారు. ముఖాముఖి అనంతరం పారిశుధ్య కార్మికుడు నాగార్జునను మంత్రి శాలువాతో ఘనంగా సత్కరించారు. అంతకు ముందు ఎకో పార్క్ లో వాకింగ్ చేసే మంగళగిరి వాసులకు సొంత నిధులు రూ.5 లక్షలు వెచ్చించి ఉచిత ప్రవేశం కల్పించిన మంత్రి నారా లోకేష్‌ను నేచర్ వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు.

మెప్మా స్టాల్స్‌కు సందర్శన

స్వచ్ఛ మంగళగిరి ఉద్యమంలో నియోజకవర్గ ప్రజలు భాగస్వాములు కావాలని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పిలుపునిచ్చారు. మంగళగిరి-తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో నిర్వహించిన స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పాల్గొన్నారు. మొదట మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్లాస్టిక్ రహిత స్టాల్స్‌ను పరిశీలించారు. డ్రాయింగ్ లో ప్రతిభ కనబరచిన విద్యార్థులకు ప్రశంసపత్రాలు అందజేశారు. స్వచ్ఛ మంగళగిరి పోస్టర్‌ను, బ్రోచర్‌ను ఆవిష్కరించారు. అధికారులు, నాయకులు, విద్యార్థులతో స్వచ్ఛ మంగళగిరి ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ పరిశుభ్రత పాటించాలని అన్నారు. మన ఇంటి నుంచి వెలువడే వ్యర్థాల నిర్వహణ భాద్యత మనమే తీసుకోవాలన్నారు. మన ఇంట్లో వెలువడే చెత్తను బహిరంగ ప్రదేశాలలో, ఖాళీ స్థలాలు, మురుగు కాలువల్లో వేయకుండా ప్రతి రోజు మన



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి నారా లోకేష్



మంగళగిరి ఎకో పార్క్‌లో చెత్తను తీసి డస్ట్ బిన్‌లో వేస్తున్న మంత్రి నారా లోకేష్

ఇంటి ముందుకు వచ్చే నగరపాలక సంస్థ వాహనాలకు అందజేసి మన పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుదామని అన్నారు. నియోజకవర్గాన్ని స్వచ్ఛ మంగళగిరిగా మార్చాలన్న ఉద్దేశ్యంతో స్వచ్ఛ-మంగళగిరి కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు చెప్పారు. ఎస్ఎఇఎల్, దివిస్ సంస్థలు సిఎస్ఆర్ కింద నిధులు ఇవ్వడంతో పాటు స్వచ్ఛమంగళగిరికి సహకరిస్తున్నారని తెలిపారు. ఎస్ఎఇఎల్‌సంస్థ సచివాలయాలకు రూ.కోటి 25లక్షలు శానిటేషన్ కిట్స్ అందజేయగా, దివిస్ స్వచ్ఛ అంబాసిడర్‌లకు జీతాలు చెల్లిస్తున్నారన్నారు. స్వచ్ఛ-మంగళగిరి ప్రత్యేక డ్రైవ్ ద్వారా 365 రోజుల్లో మంగళగిరి-తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్‌ను దేశంలోనే చెత్త రహిత కార్పొరేషన్‌గా తీర్చిదిద్దుతామన్నారు. నెల రోజుల్లో అన్ని సచివాలయాల పరిధిలో ప్రత్యేక డ్రైవ్ ద్వారా పారిశుధ్యంపై ఇంటింటి అవగాహన కల్పించడం పాటు పారిశుధ్య పనులు చేపట్టడం జరుగుతుందని, అందుకోసం 70 మంది అదనపు కార్మికులను తాత్కాలికంగా నియమించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి, తెనాలి సబ్ కలెక్టర్ సంజన సిన్హా, కార్పొరేషన్ కమిషనర్ ఎస్ ఆలిం భాష, అడిషనల్ కమిషనర్ కే శకుంతల, అసిస్టెంట్ కమిషనర్ బి శ్రీకాంత్ పాల్గొన్నారు.

రేపటి పంచాయతీ కార్మికుల ధర్నా జయప్రదం చేయండి

ప్రజాశక్తి - మేడికొండూరు



మేడికొండూరు మండలంలోని అన్ని గ్రామాల పంచాయతీ కార్మికులు ఈ నెల 17న విజయవాడలో జరగనున్న మహా ధర్నాను జయప్రదం చేయాలని, మండల సిఐటియు అధ్యక్షులు ఎస్ఎం భాషా పిలుపునిచ్చారు. మండలంలోని పేరేచర్ల గ్రామపంచాయతీ వర్కర్స్ సమావేశము శనివారము జరిగింది. ఈ సందర్భంగా భాష మాట్లాడుతూ పంచాయతీ కార్మికులకు జీతాలు పెంచాలని, గ్రీన్ అంబాసిడర్లుకు రూ. 10వేలు వేతనమివ్వాలని, కార్మికులకు132,142,680, జీవోలు అమలు చేయ్యాలని డిమాండ్ చేశారు. జీవో581 ద్వార గుర్తింపు కార్డులు ఇవ్వాలని, జీతాలు 5 వతేదిలోపు ఇవ్వాలని తదితర డిమాండ్‌ల పరిష్కారం కోసం విజయవాడలో నిర్వహించే ధర్నాను జయప్రదం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో పంచాయతీ వర్కర్స్ యూనియన్ కార్యాదర్శి జమ్ముల శంకర్, నాగేశ్వరరావు, డి. వెంకాయమ్మ , బి. ఛార్లెసు, డి. కరుణ తదితరులు పాల్గొన్నారు.



నూతన కౌలుచట్టాన్ని ఆమోదించాలి

ప్రజాశక్తి - దుగ్గిరాల

అసెంబ్లీసమావేశాల్లో నూతన కౌలు చట్టం ఆమోదించాలని, అన్నదాత సుఖీభవ కింద రూ.20వేలు పెట్టుబడి సాయం అందజేయాలని తదితర డిమాండ్‌లను ముఖ్యమంత్రికి పంపించాలని కోరుతూ శనివారం రైతు సంఘం ఆధ్వర్యంలో తుమ్మపూడి సచివాలయంలో వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మన్నవ నాగమల్లేశ్వరరావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు జెట్టి బాలరాజు, జి యోహాను బుస్సా చిరంజీవి కే సుబ్బారావు ఎం జానీ భాష తదితరులు పాల్గొన్నారు.

గ్రామకంతాల సమస్యను పరిష్కరించండి

సిఆర్‌డిఎ కమిషనర్ కన్నబాబుకు రాజధాని రైతుల విజ్ఞప్తి

ప్రజాశక్తి - తుళ్లూరు



సిఆర్‌డిఎ కమిషనర్ కన్నబాబుకు సమస్యలు వివరిస్తున్న రైతులు

గ్రామకంతాల సమస్యను పరిష్కరించాలని సిఆర్‌డిఎ కమిషనర్ కె కన్నబాబును రాజధాని రైతులు కోరారు. విజయవాడలోని సి ఆర్ డి ఎ కార్యాలయంలో శనివారం జరిగిన గ్రీవెన్స్‌డే లో రైతులు గ్రామకంతాల సమస్యలను లేవనెత్తారు. గ్రామకంతాల సమస్య పరిష్కారంలో అధికారులు ఉదాశీనత కనబరుస్తున్నారని అన్నారుఎప్పటిలోగా పరిష్కారిస్తారో చెప్పాలన్నారు. దీనికి కమిషనర్ స్పందిస్తూ, ప్రాధాన్యతాక్రమంలో గ్రామకంతాల సమస్యను పరిష్కరిస్తామని చెప్పారు. రైతు సమస్యల సత్వర పరిష్కారానికి అధిక ప్రాధాన్యత నిస్తామని, నిర్దేశిత గడువులోగా రైతుల సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. రైతులు సంతృప్తి చెందే విధంగా పరిష్కారం ఉండాలన్నారు. అదనపు కమిషనర్ జి సూర్యసాయి ప్రవీణ్ చంద్‌తో కలసి ఆయన శనివారం విజయవాడ సిఆర్‌డిఎ కార్యాలయంలో జరిగిన గ్రీవెన్స్ డే కార్యక్రమంలో పాల్గొన్నారు. రైతులు, అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఒకవైపు రైతు సమస్యలు తెలుసుకుంటూనే మరోవైపు సంబంధిత అధికారులతో చర్చించారు. అవకాశం ఉన్నవి అక్కడిక్కడే పరిష్కరించి మిగతావి గడువులోగా పూర్తి స్థాయిలో పరిష్కారం అయ్యేలా చూడాలని అధికారులను అదేశించారు. మొత్తం గ్రీవెన్స్ పోర్టల్‌లో 93 సమస్యలు నమోదు కాగా సంబంధిత రైతులందరినీ పిలిచి మాట్లాడారు. ప్రతి శుక్రవారం తుళ్లూరులోని సిఆర్‌డిఎ ప్రాంతీయ కార్యాలయంలో జరిగే గ్రీవెన్స్‌డే తో పాటుగా ప్రతి శనివారం విజయవాడ సిఆర్‌డిఎ ఆఫీసులో స్వయంగా తానే ఈ సమస్యలపై సమీక్షా సమావేశం నిర్వహిస్తానని చెప్పారు. రైతుల నుంచి నేరుగానే కాకుండా ఆన్‌లైన్ విధానంలో కూడా ఫిర్యాదులను స్వీకరిస్తున్నట్టు చెప్పారు. ధరఖాస్తు అందినప్పటి నుంచి అది పరిష్కారమయ్యే వరకు ఎప్పటికప్పుడు రైతుల ఫోన్లకు మెసేజ్ వెళ్తుందని చెప్పారు. కార్యక్రమంలో సిఆర్‌డిఎ ల్యాండ్స్ అండ్ ఎస్టేట్స్ జాయింట్ డైరెక్టర్ డేవిడ్ రాజు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు,తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు, సర్వేయర్లు, విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.




జెండా ఆవిష్కరణలో పాల్గొన్న నాయకులు, మహిళలు

పాతగుంటూరులో ఐద్వా జెండా ఆవిష్కరణ

ప్రజాశక్తి-గుంటూరు

అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) ఆవిర్భవించి 44 సంవత్సరాలు అయిన సందర్భంగా శనివారం పాత గుంటూరు, శ్రామిక నగర్‌లో ఐద్వా జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా కార్యదర్శి ఎల్.అరుణ మాట్లాడుతూ మానికొండ సూర్యావతి, కొమర్రాజు అచ్చమాంబ, మల్లు స్వరాజ్యం, మోటూరు ఉదయం, భిక్షావతి లాంటి మహిళా నాయకులు మహిళల హక్కుల కోసం ఆస్తి హక్కు, ఓటు హక్కు కోసం, గృహహింస చట్టం కోసం మరుగుదొడ్ల నిర్మాణం లాంటి సమస్యలపై ఎన్నో పోరాటాలు చేశారన్నారు. ఎన్నో అవమానాలను ఎదుర్కొంటూ మహిళల సమస్యలపై పనిచేశారన్నారు. దేశవ్యాప్తంగా కోటి సభ్యత్వంతో రాష్ట్రంలో 2.30 లక్షల సభ్యత్వం కలిగి మహిళలపై జరుగుతున్న అకృత్యాలు, దాడులు, గృహహింస, మూఢ నమ్మకాలకు వ్యతిరేకంగా ఐద్వా పోరాడుతుందని చెప్పారు. మహిళలు అందరూ ఐక్యంగా ఉండాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఐద్వా నగర అధ్యక్షులు జి.రమణ, ఎం కృష్ణకుమారి, వి.ఆదిలక్ష్మి, కుమారి, శివమ్మ, అంకమ్మ, బుజ్జి తదితరులు పాల్గొన్నారు.



సాంబిరెడ్డి,శ్రీనివాసరెడ్డికి చెక్కును అందచేస్తున్న వాలాగ్రో ప్రతినిధులు

ముచ్వా చినబాపిరెడ్డి ట్రస్టుకు వాలాగ్రో విరాళం

ప్రజాశక్తి-గుంటూరు

వృద్ధాలయం పేరుతో పెద్దలకు, నైపుణ్య శిక్షణ పేరుతో నిరుద్యోగ యువతకు ముచ్వా చినబాపిరెడ్డి మెమోరియల్ ట్రస్ట్ గొప్ప సహాయ సహకారాలు అందిస్తోందని వాలాగ్రో బయోసైన్సెస్ ప్రైవేట్ లిమిటెడ్ ఫైనాన్షియల్ హెడ్ రామకృష్ణ అన్నారు. హైదరాబాద్‌కు చెందిన ఆ కంపెనీ సభ్యులు తుళ్లూరు మండలం పెదపరిమిలోని ముచ్వా ట్రస్ట్ క్యాంపస్‌ను శనివారం పరిశీలించి, తమ సీఎస్ఆర్ నిధుల నుంచి రూ. 8.70 లక్షల చెక్కును ట్రస్టు సభ్యులైన వంగా సాంబిరెడ్డి, మున్నగి శ్రీనివాసరెడ్డిలకు అందజేశారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ పాతికేళ్లకు పైగా ట్రస్టు నిబద్ధతతో పని చేయటం అభినందనీయమన్నారు. వృద్ధులకు సౌకర్యవంతమైన వసతి కల్పించేందుకు తమ కంపెనీ తరపున ఆర్థిక సహకారం అందించినట్లు చెప్పారు. సభకు అధ్యక్షత వహించిన ట్రస్టు ఛైర్మన్ ఎం.వి. రామిరెడ్డి మాట్లాడుతూ 28 ఏళ్లుగా విద్య, వైద్యం, మహిళా సాధికారత అంశాలపై కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఇటీవల ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగాల నిమిత్తం నిరుద్యోగ యువతకు ఉచితంగా శిక్షణనిస్తున్నామని, ఇప్పటిదాకా సుమారు వెయ్యి మంది యువత శిక్షణ పొంది 700 మందికిపైగా ఉద్యోగాలు సాధించినట్లు చెప్పారు. కార్యక్రమంలో వాలాగ్రో కంపెనీ హెచ్ఆర్ హెడ్ తుమ్మూరు రఘురామిరెడ్డి, ఉద్యోగులు నరేంద్ర, శ్యామ్, సురేంద్రలతోపాటు ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.

రైతులకు ఇండియన్ బ్యాంక్ సేవలు ప్రశంసనీయం : ఎమ్మెల్యే నరేంద్ర

ప్రజాశక్తి-గుంటూరు

ఇండియన్ బ్యాంక్ గ్రామీణ రైతాంగానికి అన్ని విధాల చేయూతనందించటం అభినందనీయమని సంఘం డైరీ చైర్మన్, ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ అన్నారు. స్థానిక జెకెసి కాలేజి రోడ్డులోని ఇండియన్ బ్యాంక్ రీజనల్ కార్యాలయంలో ఇండియన్ బ్యాంక్‌తో సంఘం డైరీ అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ఈ సందర్భంగా నరేంద్ర కుమార్ మాట్లాడుతూ పాడి పరిశ్రమ అభివృద్ధి కోసం ఇండియన్ బ్యాంకు ముందుకు రావడం పాడి ఉత్పత్తిదారులకు మేలు కలుగుతుందని చెప్పారు. గ్రామీణ ప్రాంత రైతాంగానికి ఇండియన్ బ్యాంక్ శాఖలను పెంచి మరింతగా సహాయ సహకారాలు అందించాలని కోరారు. ఈ సందర్భంగా ఇండియన్ బ్యాంక్ జనరల్ మేనేజర్ వి.చంద్రశేఖరన్ మాట్లాడుతూ సంఘం డైరీ యాజమాన్యంతో కుదుర్చుకున్న ఒప్పందం ద్వారా పాడి రైతులకు పసు రుణాలు, కిసాన్ క్రెడిట్ కార్డులు అందజేయబడతాయని చెప్పారు. తద్వారా పాడి రైతులు బ్యాంకు ఆర్థిక సహకారంతో తమ ఉత్పత్తులను రెట్టింపు చేసుకుని ఆర్థికంగా బలపడే అవకాశాలు మెరుగుపడతాయని వివరించారు. కార్యక్రమంలో సంఘం డైరీ ఫైనాన్స్ మేనేజర్ సాంబశివరావు, ఇండియన్ బ్యాంక్ ఫీల్డ్ జనరల్ మేనేజర్ జి.రాజేశ్వరరెడ్డి, అమరావతి, విజయవాడ ప్రాంత మేనేజర్లు డిఎస్ మూర్తి, రాజేష్ తదితరులు పాల్గొన్నారు



ఒప్పందపత్రాలు మార్చుకుంటున్న నరేంద్రకుమార్, బ్యాంకు జిఎం చంద్రశేఖరన్

పరిశుభ్రతతోనే ప్రజారోగ్యం : చీఫ్ విప్ జీవీ

వినుకొండ : పరిశుభ్రతతోనే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని ప్రభుత్వ చీఫ్ విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. శనివారం వినుకొండ పట్టణంలోని 27వ వార్డు హనుమాన్ నగర్ ప్రాథమిక పాఠశాల వద్ద నిర్వహించిన స్వచ్ఛ ఆంధ్ర- స్వచ్ఛ వినుకొండ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతిఒక్కరు పరిసరాల పరిశుభ్రతను బాధ్యతగా తీసుకోవాలని, 120 మైక్రాన్ల కంటే పలచని సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధాన్ని అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. భారతదేశ చరిత్రలోనే చెత్తమీద పన్ను వేసిన చెత్త ప్రభుత్వ, చెత్త ముఖ్యమంత్రిగా చరిత్రలో నిలిచిపోయిన జగన్ 123 మున్సిపాల్టీలో 85 లక్షల టన్నుల చెత్తను వదిలేసి పోయారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ అక్టోబర్-2నాటికి



ప్రతిజ్ఞ చేయిస్తున్న ప్రభుత్వ చీఫ్ విప్ ఆంజనేయులు

ఆ చెత్త మొత్తాన్ని శుభ్రం చేయడం, వ్యర్థాల నుంచి సంపద సృష్టించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలు జారీ చేశారన్నారు. పర్యావరణ పరిరక్షణ, పరిశుభ్రతల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించి స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేశారు. ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి పరిసరాలను శుభ్రం చేశారు. పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. చెత్తకుప్పలు పేరుకుంటే అపరిశుభ్రత, బాక్టీరియా పెరిగి ప్రజల ఆరోగ్యం పాడవుతుందన్నారు. మట్టిలో కలిసిపోయే బయో డీగ్రేడబుల్ మెటీరియల్ మాత్రమే వాడాలని.. వ్యాపారులు కూడా అలాంటి ఉత్పత్తులే అమ్మాలి అని విజ్ఞప్తి చేశారు. ఇదే సందర్భంగా చెత్త పన్ను తీసి వేసిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు ధన్యవాదాలు తెలియ జేశారు చీఫ్‌విప్ జీవీ. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సుభాష్ చంద్రబోస్, కౌన్సిలర్లు, కూటమి నాయకులు పాల్గొన్నారు.


స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో జిల్లా కలెక్టర్

పరిసరాల శుభ్రతకు ప్రతి ఒక్కరూ పాటు పడాలి

జిల్లా కలెక్టర్ పి.అరుణ్ బాబు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నెల మూడో శనివారం చేపడుతున్న స్వర్ణఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా పల్నాడు జిల్లా కలెక్టర్ పి.అరుణ్ బాబు రాజుపాలెం మండలం, నెమలిపురిలో నిర్వహించిన స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్లాస్టిక్‌ని నిషేధిద్దాం పునర్వినియోగ వస్తువులను ప్రోత్సాహించాలన్నారు.. సచివాలయం సిబ్బంది వారి సామాగ్రిని జూట్‌బ్యాగులులో తీసుకురావాలని ఆయన సూచించారు. ప్రజలు స్వచ్ఛత కార్యక్రమాన్ని అర్థం చేసుకొని పారిశుధ్య కార్మికులకు సహకరించాలన్నారు. చెత్తను ఎక్కడంటే అక్కడ పార వేయ కుండా చెత్త సేకరణకు వచ్చిన వారికి అందజేయాలన్నారు. అనంతరం అందరి చేత ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి భాస్కరరెడ్డి, మండల రెవెన్యూఅధికారి దుర్గేష్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజల సహకారంతోనే స్వచ్ఛ చిలకలూరిపేట సాకారం

శాసన సభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు

ప్రజాశక్తి-చిలకలూరిపేట

ప్రజలు స్వచ్ఛ చిలకలూరిపేట కార్య క్రమాన్ని తమ బాధ్యతగా భావించాలని, ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని, తడి-పొడిచెత్తను వేరుచేసి పారిశుధ్య కార్మికులకు అందించాలని శాసన సభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు సూచించారు. శనివారం పట్టణంలోని కళామందిర్ సెంటర్లో జరిగిన స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర కార్యక్రమంలో ప్రజల్ని ఉద్దేశించి ఆయన మాట్లాడారు. స్థానిక గాంధీ పార్క్ ఆవరణలో చెత్తను తొలగించడంతో పాటు, మార్కెట్లో తిరుగుతూ, వ్యర్థా లను రోడ్లపై వేయడంవల్ల కలిగే అనర్థాలను వ్యాపారులు, ప్రజలకు తెలియచేశారు. స్వయంగా జూట్ క్యారీ బ్యాగు లను పంపిణీ చేశారు. ఒకప్పుడు చిలకలూరిపేట మున్సిపాలిటీ రాష్ట్రానికే రోల్ మోడల్‌గా నిలిచిందని, అప్పటి మున్సిపల్ కమిషనర్ బెస్ట్ కమిషనర్‌గా అవార్డు కూడా తీసుకున్నారని, ఆ స్ఫూర్తితో ఇప్పుడున్న కమిషనర్ చిత్తశుద్ధి తో పనిచేయాలని సూచించారు. సూర్యఘర్ పథకంపై ప్రజలకు అవగాహన కల్పించి, సౌర విద్యుత్ వినియోగంలో చిలకలూరిపేట రాష్ట్రంలోనే ముందుండేలా అధికారులు కృషి చేయా


మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

లన్నారు. ఎస్సీ, ఎస్టీలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తి ఉచితంగా ఈ పథకాన్ని అందు బాటులోకి తీసుకొచ్చాయన్నారు. సూర్య ఘర్ పథకం అమలుకు సిద్ధమైన ప్రజలకు అవసర మైతే అదనపు రాయితీలు ఇచ్చేలా ప్రభుత్వంతో తానేస్వయంగా మాట్లాడతాన్నన్నారు. కార్య క్రమంలో కూటమి నాయకులు, మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, కమిషనర్ శ్రీహరి బాబు మున్సిపల్ అధికారులు, పట్టణ సీఐ రమేష్ బాబు, టీడీపీ నాయకులు షేక్ టీడీపీ కరిముల్లా, పట్టణ అధ్యక్ష కార్యదర్శులు పఠాన్ సమద్ ఖాన్, మద్దుమాలరవి, మున్సిపల్ కౌన్సిలర్‌లు, మున్సిపల్ అధికారులు, పారిశుధ్య సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి : తహశీల్దార్


ప్రజాశక్తి కారంపూడి

మన చుట్టూ వున్న పరిసరాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచుకోవాలని మండల తహశీల్దార్ వెంకటేశ్వర్లు నాయక్ తెలిపారు. కారంపూడి పట్టణంలో తహశీల్దార్ ఆధ్వర్యంలో శనివారం మండల తహశీల్దార్ కార్యాలయం ఆవరణలో స్వర్ణాంధ్ర- స్వచ్ఛ దివస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. వీధులను శుభ్రంగా ఉంచాలని కోరారు. కార్యక్రమంలో ఇంచార్జ్ ఆర్ఐ వేముల. శ్రీనివాసరావు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

కాసు మహేష్‌రెడ్డికి శ్రీనివాసరెడ్డి పరామర్శ

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

గురజాల మాజీ ఎమ్మెల్యే కాసుమహేష్‌రెడ్డి ఇటీవల స్వగృహంలో గాయపడ్డారు. నరసరావుపేట ప్రకాష్‌నగర్ లోని స్వగృహంలో విశ్రాంతి తీసుకుంటున్న కాసు మహేష్ రెడ్డిని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస రెడ్డి పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. రొంపిచర్ల మాజీ మార్కెట్ చైర్మన్ పచ్చవ రవీంద్ర బాబు, నాయకులు తన్నీరు శ్రీనివాసరావు, చిట్టిబాబు, బీరంభాస్కర్‌రెడ్డి, పోనుగోటి వెంకట్రావు,శివారెడ్డి,సుబ్బారెడ్డి పాల్గొన్నారు.


'కాసు'ను పరామర్శిస్తున్న శ్రీనివాసరెడ్డి


మాట్లాడుతున్న పశుసంవర్ధక శాఖ అధికారి శ్రీనివాస్ రావు

మండల అభివృద్ధికి సహకరించండి

ప్రజాశక్తి సత్తెనపల్లి రూరల్

మండల అభివృద్ధికి సహకరించాలని ఎంపీపీ యలర్తపాటి షేక్ జై బున్‌బీ విజ్ఞప్తి చేశారు. సత్తెనపల్లి మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ యలవర్తి పాటి షేక్ జై బున్ బీ అధ్యక్షతన శనివారం జరిగింది. వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు ఆయా శాఖల ద్వారా జరిగే అభివృద్ధి, సంక్షేమ కార్య క్రమాలు సభ్యులకు వివరించారు. గృహ నిర్మాణ శాఖ ద్వారా ఇల్లు నిర్మించుకున్న ఎస్సీ, ఎస్టి బిసి లబ్ధిదారులకు ఎస్సీ బిస్సీ వర్గాలకు 50వేలు, ఎస్టీలకు 75వేలు అంద జేస్తుందని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో బి శ్రీనివాస్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. సమావేశంలో సర్పంచులు ఎంపీటీసీలుకోఆప్షన్‌సభ్యులు, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం : ఎమ్మెల్యే జూలకంటి


మార్కెట్ పరిసరాలను చీపురుతో శుభ్రపరుస్తున్న ఎమ్మెల్యే

ప్రజాశక్తి - మాచర్ల :

మనం నివసించే ఇల్లు, మనం పని చేసే పరిసరాలు శుభ్రంగా ఉంటేనే మన ఆరోగ్యం బాగుంటుందని మాచర్ల శాసనసభ్యులు జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. శనివారం ఉదయం ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి స్థానిక కూరగాయాల మార్కెట్ ఆవరణలో స్వయంగా చీపురు పట్టి పరిసరాలను శుభ్రం చేశారు. మార్కెట్లో ఉన్న వ్యర్థాలను తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిశరాల పరిశుభ్రత పట్ల ప్రజలు, వ్యాపారులు, వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాల్లో పని చేసే ఉద్యోగులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు. అనంతరం పార్క్ సెంటర్ సమీపంలోని అటవీశాఖ కార్యాలయంలో ఎమ్మెల్యే జూలకంటి ఆకస్మిక తనిఖీ చేశారు. అటవీశాఖ క్షేత్ర స్థాయి కార్యాలయంలో క్లీన్ అండ్ గ్రీన్ ఎక్కడ అని ఫారెస్ట్ రేంజ్ అధికారి విజయలక్ష్మీని ఎమ్మెల్యే ప్రశ్నించారు. ఫారెస్ట్ కార్యాలయంలో నెలకొన్న అపరిశుభ్ర వాతావరణంపై ఆయన మండిపడ్డారు. తిరిగి మరొక రోజు కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేస్తానని, అప్పటిలోగా కార్యాలయంలో పేరుకున్న వ్యర్థాలను తొలగించి పరిసరాలను క్లీన్ అండ్ గ్రీన్‌గా ఉంచాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పోలూరి నరసింహారావు, కమిషనర్ డి. వేణుబాబు, నాయకులు జూలకంటి అక్కిరెడ్డి, కొమెరా దుర్గారావు పాల్గొన్నారు.

నేడు వడ్డె ఓబన్న విగ్రహా ఆవిష్కరణ

ప్రజాశక్తి - మాచర్ల : పట్టణంలోని వేంకటేశ్వర హాల్ సెంటర్ వద్ద ఏర్పాటు చేసిన తొలి స్వాతంత్ర్య యోధుడు వడ్డె ఓబన్న విగ్రహాన్ని ఆదివారం ఆవిష్కరించారు. ముఖ్యఅతిథులుగా నరసరావు పేట పార్లమెంట్ సభ్యులు లావు శ్రీకష్ణ దేవరాయలు, మాచర్ల శాసన సభ్యులు జూలకంటి బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం, తెలుగు దేశం పార్టీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ చిరుమామిళ్ళ మధుబాబు, పల్నాడు జిల్లాలోని వడ్డెర కుల పెద్దలు హాజరుకానున్నారు.


భట్లూరు గ్రామంలో నిర్వహిస్తున్న ర్యాలీ

ప్లాస్టిక్‌ను నిషేధిస్తూ తీర్మానం

ప్రజాశక్తి సత్తెనపల్లి రూరల్

సత్తెనపల్లి మండలం పరిధిలోని అన్ని గ్రామ పంచాయతీల స్వచ్ఛా ఆంధ్ర స్వర్ణాంధ్రలో భాగంగా అన్ని గ్రామ పంచాయతీల్లో సింగిల్ యూస్డ్ ప్లాస్టిక్ వస్తువులను నిషేధిస్తూ గ్రామసభలు నిర్వహించి తీర్మానం చేశారు. సత్తెనపల్లి మండలం అన్ని గ్రామపంచాయతీల్లో స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛంద కార్యక్రమం శనివారం నిర్వహించారు. భట్లూరు గ్రామంలో ప్లాస్టిక్ వల్ల కలిగే అనర్థాలు గురించి గ్రామంలో ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచి కె రామారావు ఎంపీడీవో బి శ్రీనివాస్ రెడ్డి ప్రత్యేక పరిశీలికలు పి శ్రీనివాసరావు ఈఓపిఆర్ డి శ్రీనివాస్ రెడ్డి ఎంపీటీసీ సభ్యులు వార్డు మెంబర్లు సచివాలయ సిబ్బంది గ్రామపంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

జల వనరుల శాఖ ఆధ్వర్యంలో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర'

ప్రజాశక్తి - విజయపురిసౌత్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర' కార్యక్రమాన్ని నాగార్జున సాగర్ జల వనరుల శాఖ ఆధ్వర్యంలో స్థానిక వాటర్ సప్లైకార్యాలయం వద్ద శనివారం నిర్వహించారు. ఉద్యోగులతో పాటు నాయకులు చీపురులను చేతబట్టి పరిసరాలను శుభ్రం చేశారు.ఈ సందర్భంగా సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు ఊరే మార్క్,టీడీపీ నాయకుడు ఘంటా ధనుంజయరావు,ఉద్యోగులు వెంకటేశ్వర్లు, తుమ్మనాధం,జయరావు తదితరులు పాల్గొన్నారు.

కౌన్సిలర్లు, అధికారులు ప్రజల్ని కలిసి సమస్యలు తెలుసుకోవాలి : ప్రత్తిపాటి

ప్రజాశక్తి-చిలకలూరిపేట

ప్రజా సమస్యల పరిష్కారం కోసం కూటమి ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలు ఫలించాలంటే, అధికారులు స్థానిక ప్రజాప్రతి నిధులు క్షేత్రస్థాయిలో నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండాలని శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. శనివారం ఆయన పట్టణంలోని మున్సిపాలిటీలో నిర్వహించిన గ్రీవెన్స్‌లో పాల్గొని ప్రజల నుంచి అర్జీలు స్వీక రించారు. పట్టణవ్యా ప్తంగా వివిధ వార్డుల నుంచి వచ్చిన ప్రజలతో మాట్లాడిన వారి సమస్యల పరిష్కారం దిశగా అప్పటికప్పుడే అధికారులతో మాట్లాడారు. ప్రజలు తాము ఎదుర్కొంటున్న సమస్యల్ని ఫిర్యాదుల రూపంలో తన దృష్టికి తీసుకొచ్చారని, ఎక్కువగా రోడ్లు ఎగుడుదిగుడుగా, గుంతలతో ఉండటం, డ్రైనేజ్‌ల నిర్మాణం, తాగునీటి సమస్యలకు సంబంధించిన ఫిర్యా దులు వచ్చాయన్నారు. సమస్యల పరిష్కారానికి అధికారులకు తగు సూచనలు ఆదేశాలిచ్చామన్నారు. పట్టణంలో కుక్క ల సంచారం లేకుండా చూడాలని, వీధి కుక్కల్ని పట్టి, జనావాసాలకు దూరంగా తరలించాలన్నారు. కార్యక్రమం లో మున్సిపల్ చైర్మన్ షేక్ రఫానీ, మున్సిపల్ కమిషనర్ శ్రీహరి, డిఈరహీం, పట్టణ సీఐ రమేష్ బాబు, మున్సిపల్ కౌన్సిలర్లు, కూటమినాయకులు, అధికారులు, పాల్గొన్నారు.


థైరాయిడ్ పరీక్షలు చేస్తున్న డాక్టర్ ప్రసన్న

విద్యార్థులకు థైరాయిడ్ పరీక్షలు

ప్రజాశక్తి - మాచర్ల రూరల్ :

రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో జాతీయ అయోడిన్ లోప వ్యాధుల నివారణ సర్వే చేపట్టినట్లు డాక్టర్ లక్ష్మీప్రసన్న తెలిపారు. శనివారం సర్వేలో భాగంగా పట్టణంలోని అర్బన్ హెల్త్ సెంటర్ నందు రోప్‌వే కాలనీ సచివాలయం పరిధిలోని ఎంపిపి స్కూల్, సెయింటాన్స్ గరల్స్ అండ్ బాయ్స్‌స్కూల్ విద్యార్థులకు డాక్టర్ లక్ష్మీ ప్రసన్న థైరాయిడ్ వైద్య పరీక్షలు నిర్వహించారు. మొత్తం 90 మందికి పరీక్షలు నిర్వహించారు. 18 ఉప్పు పరీక్షలు, 9 మూత్ర శాంపిల్స్‌ని పరీక్షలు నిమిత్తం రాష్ట్ర ల్యాబ్‌కు పంపినట్లు లక్ష్మీ ప్రసన్న తెలిపారు. కార్యక్రమంలో వార్డు హెల్త్ సెక్రటరీలు కె. జయమ్మ, షేక్ . షమీల, డి.కుమారి, లక్ష్మీదేవి, లిల్లీపుష్ప, శిరీష, బేగం, రాజకుమారి, ఆశా కార్యకర్తలు వెంకటేశ్వరమ్మ, రమాదేవి పాల్గొన్నారు.

ప్లాస్టిక్ రహిత పట్టణంగా తీర్చిదిద్దటమే లక్ష్యం

మున్సిపల్ కమిషనర్ శేషన్న ఆధ్వర్యంలో స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమం



ప్రతిజ్ఞ చేస్తున్న ట్రైయినీ కలెక్టర్, మున్సిపల్ అధికారులు



జిజిహెచ్ ప్రాంగణంలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు, సిబ్బంది

ప్రజాశక్తి తెనాలి

ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా పిలుపునిచ్చిన స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. తొలుత పురపాలక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన సర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ట్రైయినీకలెక్టర్ పవార్ స్వప్నిల్ జగన్నాథ్ పాల్గొన్నారు. మున్సిపల్ కమిషనర్ బి శేషన్న ఆధ్వర్యంలో పట్టణాన్ని ప్లాస్టిక్ రహితంగా తీర్చిదిద్దటమే లక్ష్యంగా ప్రతిజ్ఞ చేయించారు. పురపాలక సంఘ కార్యాలయం, శివాజీ చౌక్‌లో ఏర్పాటు చేసిన సింగిల్ యూస్డ్ ప్లాస్టిక్ కలెక్షన్ పాయింట్లను ఆయన పరిశీలించారు. ప్లాస్టిక్కు సేకరించి, ప్రోత్సాహక బహుమతిగా పంచదార, టమోటా తదితర నిత్యావసరాలను అందించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్ పర్సన్ తాడిబోయిన రాధిక, కమిషనర్ బి శేషన్న మాట్లాడుతూ పట్టణంలో పారిశుధ్యం మెరుగు పరిచేందుకు ప్రజల భాగస్వామ్యంతో వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పారిశుధ్యం బాగుంటేనే సమాజం బాగుంటుందని, సమాజం బాగుంటేనే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీపతి, ప్రజారోగ్యం, పట్టణ ప్రణాళిక విభాగం, రెవెన్యూ, మెప్మా, ఇంజనీరింగ్ విభాగాల అధికారులు, సిబ్బంది, మునిసిపల్ కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు.

తెనాలి జిల్లా ప్రభుత్వ వైద్యశాలలో..

రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలను అనుసరించి స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం జిల్లా ప్రభుత్వ వైద్యశాలలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని, ప్లాస్టిక్ ఉత్పత్తులను ఉపయోగించడం వలన కలిగే దుష్ఫలితాలను జిల్లా వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సౌభాగ్యవాణి ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని, ప్లాస్టిక్ ఉత్పత్తులను వాడరాదని, అవి పర్యావరణానికి ముప్పని చెప్పారు. వాటికి బదులుగా గుడ్డ సంచులను వినియోగించాలని కోరారు. ఈ సందర్భంలో ప్రియదర్శిని నర్సింగ్ విద్యార్థులు ప్లాస్టిక్ వినియోగంపై స్కిట్ను ప్రదర్శించి వాటి వల్ల కలిగే దుష్ఫలితాలను వివరించారు. అవగాహన ర్యాలీలో డాక్టర్ శ్రీకాంత్, జిల్లా వైద్యశాల సిబ్బంది, ఆశా వర్కర్లు ప్రియదర్శిని నర్సింగ్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు




ప్రతిజ్ఞ చేస్తున్న మలేరియా విభాగం సిబ్బంది

ఎంఎంబీ కార్యాలయంలో స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్

ప్రజాశక్తి తెనాలి

స్థానిక పాత ప్రభుత్వ వైద్యశాల ఆవరణలో అసిస్టెంట్ మలేరియా అధికారి శిరసాని ప్రభాకరరెడ్డి సారధ్యంలో శనివారం స్వర్ణాంధ్ర స్వచ్ఛంద్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ ఉత్తర్వులను అనుసరించి ప్రతినెలా మూడవ శనివారాన్ని స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో భాగంగా కార్యాలయం చుట్టుపక్కల పిచ్చి మొక్కలను తొలగించి, రికార్డు రూములను, ల్యాబ్స్‌ను శుభ్రం చేశారు. సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో వంగల పున్నారెడ్డి, ఎస్ ఉమాకాంత్, అందె బాలచంద్రమౌళి, జి రవికుమార్, బి మల్లేశ్వరరావు, డి మల్లేశ్వర రావు, డి శ్రీనివాసరావు, యల్లయ్య, ఎం రత్నాకర్, షేక్ రషీద్, షేక్ నవీద్ ,సయ్యద్ కరిముల్లా, సంకా శరత్ బాబు పాల్గొన్నారు.



ర్యాలీలో ఎమ్మెల్యే, అధికారులు

స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ఎమ్మెల్యే నరేంద్ర

ప్రజాశక్తి చేబ్రోలు

స్వచ్ఛ ఆంధ్ర - స్వర్ణ పొన్నూరు కార్యక్రమంలో భాగం గా సింగిల్ యూజ్‌ప్లాస్టిక్‌ని పొన్నూరు పట్టణంలో పూర్తిగా నిషేధించేందుకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పొన్నూరు నియోజకవర్గ శాసనసభ్యులు సంఘం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్, పొన్నూరు నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త మార్కండేయ బాబు పాల్గొని మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే నష్టాలను వివరించారు. ప్రజలకు వున్ని తో తయారు చేసిన సంచులను ఉచితంగా అంద చేశారు. తాగునీటి పైప్‌లైన్‌ను శంకు స్థాపన చేశారు. అనంతరం నిడుబ్రోలు ప్రభుత్వ ఆసుపత్రిలో నిర్వహించిన స్వచ్ఛ ఆంధ్ర - స్వర్ణ ఆంధ్ర కార్యక్ర మంలో పాల్గొని, అనంతరం ఆసుపత్రి వైద్యులతో, సమీక్షా సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో తెలుగుదేశం-జనసేన-బిజెపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పొన్నూరు మున్సిపల్ కమిషనర్, డాక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

సింగిల్ యూస్డ్ ప్లాస్టిక్ నో చెప్పండి

ప్రజాశక్తి చేబ్రోలు : సింగిల్ యూస్ ప్లాస్టిక్ నో చెప్పండి. చేబ్రోలు ప్రతి నెల మూడో శనివారం నిర్వహించే స్వచ్ఛ్ ఆంధ్ర స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని ఈ శనివారం మండల స్థాయిలో నారాకోడూరు లో నిర్వహించారు. సందర్భంగా కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఎంపీడీవో కెలలిత, వివిధ అభివృద్ధి శాఖల మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు. సందర్భంగా లలిత మాట్లాడుతూ ఆరోగ్యంవంతమైన సమాజ కోసం ప్రతి ఒక్కరూ ఒకసారి వాడిపడేసే ప్లాస్టిక్‌కు నో చెప్పండి అని ఆమె అన్నారు. అన్ని గ్రామాల ప్రధాన వీధుల్లో ర్యాలీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఈవో పిఆర్అండ్ఆర్‌డిఏ ఈ ఆర్‌డబ్ల్యూఎస్ మండల విద్యాశాఖ అధికారి స్వచ్ఛ భారత్ మిష న్ మండల కోఆర్డినేటర్, డ్వాక్రా సంఘాల సభ్యులు, ఉపాధి హామీ కూలీలు, ఐసిడిఎస్ సూపర్వైజర్, సిబ్బంది, పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు పంచాయతీ కార్య దర్శులు సిబ్బంది క్లాత్ మిత్రలు పాల్గొన్నారు.

పెదనందిపాడులో ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన

ప్రజాశక్తి,పెదనందిపాడు: పెదనందిపాడు గ్రామ పంచాయితీ ఆధ్వర్యంలో శనివారం స్వచ్ఛ ఆంధ్ర - స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛదివస్ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. తొలుత సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌నో చెప్పండి అంటూ వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ప్లాస్టిక్ నిషేధం పై పండ్ల షాపులు, కొబ్బరి బొండాల షాపులు, బేకరీలు, తదితర షాపుల యజమానులకు అవగాహన కల్పించారు. కార్యక్రమాల్లో మండల ప్రత్యేకాధికారి కె విజయలక్ష్మి, మండల విద్యాశాఖ అధికారి ముద్దన శ్రీనివాసరావు, డిప్యూటీ తహసీల్దార్ షేక్ కరిముల్లా, ఈఓపిఆర్డి వరూధిని, పంచాయతీ సెక్రెటరీ శ్వేత,పంచాయితీ సిబ్బంది, సచివాలయం సిబ్బంది, డ్వాక్రా మహిళలు,ఆశా వర్కర్లు, అంగన్వాడి టీచర్స్ పాల్గొన్నారు.

ఆర్టీసీ ఆవరణలో స్వచ్ఛత సేవ

తెనాలిరూరల్

ప్రతి మూడో శనివారం నిర్వహించే స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని తెనాలి ఆర్టిసి డిపోలో నిర్వహించారు. డిపో మేనేజర్ ఎ రాజశేఖర్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన స్వచ్ఛత సేవ లో భాగంగా ఆర్టిసి ఆవరణలో చెత్త చెదారాలను పరిశుభ్రం చేశారు. సుమారు 80 మంది సిబ్బందితో పర్యావరణాన్ని పరిరక్షిస్తామంటూ ప్రతిజ్ఞ చేయించారు.



వాణిజ్య సంస్థల వారికి అవగాహన కల్పిస్తున్న అధికారులు

ప్లాస్టిక్ నిర్మూలనకు ప్రజలు సహకరించాలి

ప్రజాశక్తి దుగ్గిరాల

గ్రామాన్ని ప్లాస్టిక్ రహిత గ్రామంగా తీర్చిదిద్దేందుకు ప్రజలు సహకరించాలని టిడిపి వాణిజ్య విభాగ రాష్ట్ర కార్యదర్శి గూడూరు వెంకటరావు అన్నారు. ప్రభుత్వం చేపట్టిన స్వచ్ఛందర స్వర్ణాంధ్ర స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా శనివారం దుగ్గిరాల గ్రామంలో ఇంటింటికి తిరిగి ప్లాస్టిక్ వాడకం వలన జరిగే అనర్థాలు నష్టాలను గురించి వివరించారు. ఒక్కరోజులో మార్పు రాదు వచ్చేనెల మూడో శనివారం నాటికి ప్లాస్టిక్ వాడకం పూర్తిగా నిలిపివేయాలని వాణిజ్య సంస్థలను ప్రజలను కోరారు. పంచాయతీ సిబ్బంది గ్రీన్ అంబాసిడర్‌లతో కలిసి గ్రామంలో అవగాహన ర్యాలీని నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ బాణావత్ ఖుషి భాయ్ వెంకటేశ్వర నాయక్ మాజీ ఎంపీపీ వెనిగళ్ళ శ్రీకష్ణ ప్రసాద్ వల్లూరు నరసింహారావు జున్ను ఖాన్ నక్క చిరంజీవి గ్రామ కార్యదర్శి వివేకానంద పాల్గొన్నారు. ఈమని గ్రామంలో జరిగిన ఇదే కార్యక్రమంలో ఇంచార్జ్ ఎంపీపీ షేక్ జబీన్ సర్పంచ్ సిద్దల శ్రీవాణి ఉజ్వల హరిణి టిడిపి మండల అధ్యక్షురాలు కేశంనేని శ్రీ అనిత పాల్గొన్నారు.



దుర్గారావుకు నివాళి అర్పిస్తున్న నాయకులు

సిపిఎం అభిమాని మృతి

ప్రజాశక్తి మంగళగిరి

మంగళగిరి పట్టణంలోని బాపనయ్య నగరకు చెందిన బి.దుర్గారావు (66) శనివారం మృతి చెందారు. దుర్గారావు భౌతికయంపై సిపిఎం నాయకులు, సిఐటియు నాయకులు పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దుర్గారావు మంగళగిరి మున్సిపాలిటీలో యూనియన్ అధ్యక్షుడిగా పనిచేసి పారిశుధ్య కార్మికుల సమస్యల పరిష్కారానికి, సిపిఎం సానుభూతిపరుడుగా ఉంటూ ఈ ప్రాంతంలో కాలనీ ఏర్పడటానికి కృషి చేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం సీనియర్ నాయకులు జె వి రాఘవులు, సిపిఎం పట్టణ కార్యదర్శి వివి జవహర్లాల్, సిఐటియు జిల్లా నాయకులు ఎస్ ఎస్ చంగయ్య, సిఐటియు పట్టణ కార్యదర్శి ఎం బాలాజీ, ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి బాలకష్ణ, మున్సిపల్ యూనియన్ నాయకులు పి రామచంద్రరావు పాల్గొన్నారు.


దేవస్థానాలను సందర్శించిన ఉపలోకాయుక్త రిజిస్టర్ రజిని

ప్రజాశక్తి మంగళగిరి

శ్రీ లక్ష్మి నరసింహ స్వామి దేవస్థానాన్ని ఆంధ్ర ప్రదేశ్ ఉపలోకాయుక్త రిజిస్ట్రార్ పి.రజిని దంపతులు శనివారం సందర్శించారు. ఎగువ దిగువ సన్నిధిలను సందర్శించారు. ఆలయ అధికారులు ఘన స్వాగతం పలికారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారి వెంట ఆలయ ఈవో, సహాయ కమిషనర్ ఏ రామకోటి రెడ్డి, తాసిల్దార్ దినేష్ రాఘవేంద్ర పాల్గొన్నారు.

ప్రజాశక్తి దుగ్గిరాల

రాష్ట్ర లోకయుక్త పి రజిని కుటుంబ సమేతంగా శనివారం మండలంలోని కంఠంరాజు కొండూరు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ మహంకాళి అమ్మవారిని దర్శించి పూజలు నిర్వహించారు. ఆలయ కార్యదర్శి కె సునీల్‌కుమార్ పూజారులు ఆమెను మంగళ వాయిద్యాలతో స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ ఐ సునీత మరియు ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.



దేవస్థానాన్ని సందర్శించిన ఉపలోకాయుక్త రిజిస్టర్ రజిని



దుగ్గిరాలలో....

నిరుపేదలకు ఇచ్చిన హామీని నెరవేర్చండి : సిపిఐ

ప్రజాశక్తి మంగళగిరి

కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు నిరుపేదలందరికీ ఇంటి స్థలాలు ఇచ్చి ఇంటి నిర్మాణానికి ఐదు లక్షల రూపాయలు ఇవ్వాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జంగాల అజయ్ కుమార్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.శనివారం మంగళగిరి పట్టణం సిపిఐ కార్యాలయం దగ్గరనుండి నిరుపేదలతో కలిసి గౌతమ బుద్ధ రోడ్డు మీదగా మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ వరకు అర్జీదారులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. నగర పాలక సంస్థ కార్యాలయంలో నిరసనను తెలియజేశారు. అనంతరం లబ్ధిదారులతో కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా అజయ్ కుమార్ మాట్లాడుతూ నిరుపేదల పక్షాన నిలబడి పోరాడేది సిపిఐ అని ఆయన అన్నారు. అర్హత కలిగిన నిరుపేదాలందరకు ఇంటి స్థలాలు ఇవ్వాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య, సిపిఐ పట్టణ కార్యదర్శి అన్నవరపు ప్రభాకర్, సిపిఐ నియోజకవర్గ సహాయ కార్యదర్శులు యార్లగడ్డ వెంకటేశ్వరరావు, కంచర్ల కాశయ్య, మండల కార్యదర్శి జాలాది జాన్‌బాబు, పట్టణ సహాయ కార్యదర్శి నందం బ్రహ్మేశ్వరరావు, తుడుమెళ్ళ వెంకటయ్య, పంతగాని మరియదాసు, రాచకొండ శివ, చిన్ని సత్యనారాయణ, గండికోట దుర్గారావు, జవ్వాది సాంబశివరావు, ఉయ్యాల సత్యనారాయణ, పాలెంనాసరయ్య పాల్గొన్నారు.



సువార్తమ్మకు నివాళి అర్పిస్తున్న స్వరూపారాణి తదితరులు

మహిళా నేత సువార్తమ్మకు ఘన నివాళి

ప్రజాశక్తి-తెనాలిరూరల్: వేము సువార్తమ్మ మరణం పార్టీకి తీరని లోటని ప్రముఖ రచయిత్రి, విద్యావేత్త ప్రొఫెసర్ స్వరూపారాణి అన్నారు. శనివారం స్థానిక ఐతానగర్లోని తన నివాసం వద్ద జరిగిన సంస్మరణ సభలో ఆమె పాల్గొన్నారు. ప్రజానాట్య మండలిలో సువార్తమ్మ క్రియాశీలకంగా వ్యవహరించారని స్వరూపారాణి అన్నారు. ఆమె మరణం కమ్యూనిస్టులకు తీరని లోటన్నారు. దళితమహిళగా అనేక కమ్యూనిస్టు ఉద్యమాల్లో సహకరించారన్నారు. దళితలు కమ్యూనిస్టులతో కలసి ప్రయాణం చేయడం ద్వారా అనేక ఉద్యమాలను జయించామని సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి చెరుకుమళ్ళ సింగారావు తెలిపారు. తనభర్త కామ్రేడ్ రామసుబ్బయ్య సువార్తమ్మకు చిహ్నంగా స్తూపం ఏర్పాటుచేస్తామని చెప్పారు. తొలుత బొల్లిముంత కష్ణ అధ్యక్షతన జరిగిన సంతాప సభలో సిపిఎం నాయకులు కొల్లిపర బాబు ప్రసాద్, రైతు సంఘం నాయకులు బొల్లిముంత సాంబశివరావు, ఈశ్వరరావు, వెంకటేశ్వరరావు, బేతాళ ప్రసాద్, కనపర్తి బెనహర్, పిల్లి ఏసు నివాళిలర్పించారు.

ముగిసిన ఇంటర్ పరీక్షలు - రేపటి నుండి మూల్యాంకనం

ప్రజాశక్తి-గుంటూరు

ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు మార్చి ఒకటో తేదీన ప్రారంభం అయిన ప్రధాన పరీక్షలు శనివారంతో ముగిశాయి. గురువారంతో ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు, శనివారం ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు పరీక్షలు ముగిశాయి. చివరి రోజు పరీక్షలకు జనరల్, ఒకేషనల్ విద్యార్థులు కలిపి 29,405 మందికిగాను, 28,901 మంది హాజరగా, 503 మంది గైర్హాజరయ్యారు. పరీక్షలు ముగియటంతో జవాబు పత్రాల మూల్యాంకనం కార్యక్రమం ఈనెల 17 నుండి ప్రారంభం కానుంది. ఇందు కోసం స్థానిక సాంబశివపేటలోని ప్రభుత్వ మహిళా జూనియర్ కాలేజిలో మూల్యాంకన కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. మూల్యాంకన కేంద్రంలో అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు ఇంటర్ విద్య ఆర్ఐఒ జి.కె.జుబేర్ తెలియజేశారు.

సాంకేతికతను రైతుల వద్దకు తీసుకెళ్లాలి

ప్రజాశక్తి-గుంటూరు


ఒప్పందపత్రాలు మార్చుకుంటున్న ఇరు సంస్థల ప్రతినిధులు

పరిశోధనల్లో అభివృద్ధి అయిన సాంకేతికతను వ్యవహారికంగా రైతుల వద్దకు తీసుకెళ్లాలని న్యూఢిల్లీలోని ఐకార్-ఐఏఆర్ఐ (ఇండియన్ అగ్రికల్చర్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్) డైరెక్టర్, వైస్ చాన్సలర్ డాక్టర్ చెరుకుమల్లి శ్రీనివాసరావు అన్నారు. వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలో 'అకడమియా ఇండస్ట్రీ ఫార్మర్ పార్టనర్‌షిప్స్ కాన్‌క్లేవ్' నిర్వహించారు. ఈ సందర్భంగా విజ్ఞాన్స్ వర్సిటీ, ఐఐఓపీఆర్ మధ్య అవగాహన ఒప్పందానికి సంబంధించిన పత్రాలను వర్సిటీ వీసీ ప్రొఫెసర్ పీ.నాగభూషణ్ ఐఐఓపీఆర్ డైరెక్టర్ డాక్టర్ కే.సురేష్‌కు అందజేశారు.. ఈ కార్యక్రమానికి అనేక విద్యా సంస్థల ప్రతినిధులు, పరిశ్రమల ప్రముఖులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు, రైతులు హాజరయ్యారు. డాక్టర్ చెరుకుమల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ పరిశ్రమల అవసరాలకు తగ్గ వ్యవసాయ ఉత్పత్తులను ప్రోత్సహించడం, అకడెమియా-ఇండస్ట్రీ-రైతు మధ్య సహకారాన్ని బలపరచాలన్నారు. వ్యవసాయ రంగ అభివృద్ధికి సాంకేతికత, పరిశోధన, పరిశ్రమలు, రైతుల మధ్య భాగస్వామ్యం కీలకమని అన్నారు. రైతు నేస్తం ఫౌండేషన్ చైర్మన్ యడ్లపల్లి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ వ్యవసాయంలో సృజనాత్మకత, సుస్థిరత, టెక్నాలజీ వినియోగంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు తమ విజయగాథలను పంచుకున్నారు. కార్యక్రమంలో సంగం సీడ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ ఆలపాటి సత్యనారాయణ, హైదరాబాద్‌లోని ఐఐఎంఆర్ డైరెక్టర్ డాక్టర్ సీ.తారాసత్యవతి, రాజమండ్రిలోని సెంట్రల్ టొబాకో రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ డైరెక్టర్ డాక్టర్ మాగంటి శేషు మాధవ్, విజ్ఞాన్ చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య, వైస్ చైర్మన్ లావు శ్రీకష్ణదేవరాయలు పాల్గొన్నారు.

1వ తేదీ నుంచి సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ నిషేధం

ప్రజాశక్తి-గుంటూరు



ప్రతిజ్ఞ చేస్తున్న ఎమ్మెల్యే, కమిషనర్ తదితరులు

గుంటూరు నగరంలో ఏప్రిల్ 1వ తేదీ నుండి సింగిల్ యూజ్ ప్లాస్టిక్ సంపూర్ణ నిషేధం అమలు చేస్తామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు.నగర ప్రజలు, వ్యాపార సంస్థలు సహకరించాలని కోరారు. స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగం గా శనివారం పశ్చిమ నియోజ కవర్గ ఎమ్మెల్యే గల్లా మాధవి, ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపొందిన ఆలపాటి రాజేంద్రప్రసాద్‌తో కలిసి స్థానిక జెసిసి కాలేజి నుండి గుజ్జనగుండ్ల జంక్షన్ వరకు విద్యార్థులతో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగం ప్రజారోగ్యానికి ప్రమాదమని, పర్యావరణ పరిరక్షణకు ప్రజలు సహకరించాలని కోరారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్లాస్టిక్‌కి ప్రత్యామ్నాయంగా గుడ్డ, జ్యూట్ సంచులను వినియోగించాలని కోరారు. ఎమ్మెల్యే గల్లా మాదవి మాట్లాడుతూ ప్రజలు, అధికారుల సమిష్టి కృషితోనే ప్లాస్టిక్ వినియోగాన్ని అరికట్టగలం అన్నారు. తొలుత ర్యాలీని ఎమ్మెల్యే జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం అనంతరం గుజ్జనగుండ్ల జంక్షన్ వద్ద స్వచ్ఛ ప్రతిజ్ఞ చేసి, స్తంభాల గరువురిజర్వాయర్ పరిసరాల్లో వ్యర్థాలు, పిచ్చి మొక్కల తొలగింపు, లక్ష్మీపురం సీతారామయ్య స్కూల్ పక్కన పీకల వాగులో పూడికతీత పనులను చేపట్టారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు వి.శ్రీరామ్‌ప్రసాద్, మానం పద్మశ్రీ, ఈ.వరప్రసాద్, డిప్యూటి మేయర్ షేక్ సజిలా, డిప్యూటీ కమిషనర్లు సిహెచ్.శ్రీనివాస్, టి.వెంకట కృష్ణయ్య, ఎస్ఈ నాగమల్లేశ్వరరావు, సిటి ప్లానర్ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

చిన్నపిల్లలు... పెద్ద సందేశం...

ప్రజాశక్తి- తాడేపల్లి

తరగతి గదుల్లో పుస్తకాలతో బట్టీబట్టే విద్యార్థిని విద్యార్థులు శనివారం రోడ్డెక్కారు. చూడటానికి చిన్నపిల్లలే గాని - పెద్ద సందేశం ఇచ్చారు. స్వచ్ఛ ఆంధ్ర ప్రదేశ్ - స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా గుడ్ న్యూస్ హైస్కూల్ నుండి సుందరయ్య నగర్ కట్టమీద పెద్ద ప్రదర్శన నిర్వహించారు. ప్లాస్టిక్ వాడకం తగ్గించమని పెద్దలకు ఇత బోధ చేశారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని కోరారు. చెత్తను రోడ్లమీద వేయొద్దని సూచించారు. వందలాదిమంది విద్యార్థిని విద్యార్థుల ప్రదర్శనతో సుందరయ్య నగర్ కరకట్ట ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రేవా ఫాదర్ ఆరోగ్య దాస్ మరియు ప్రిన్సిపల్, కరస్పాండెంట్ సుగంధన్ మరియు గుడ్ న్యూస్ హై స్కూల్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



స్నేహపూర్వక విధానాలతో వివాదాలను పరిష్కరించుకోవాలి

హైకోర్టు న్యాయమూర్తి చీమలపాటి రవి

ప్రజాశక్తి - ఎఎన్‌యు



కోర్టు గుమ్మం తొక్కుకుండానే ప్రత్యామ్నాయ విధానాల ద్వారా వివాదాల పరిష్కారం చౌకగా మరియు సత్వర న్యాయం పొందవచ్చని ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు గౌరవ న్యాయమూర్తి చీమలపాటి రవి అన్నారు. శనివారం ఉదయం ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని ప్రొఫెసర్ వి.బాలమోహన్‌దాస్ సెమినార్ హాలులో 'ఏషియన్ సెంటర్ ఫర్ ఇంటర్నేషనల్ ఆర్బిట్రేషన్ అండ్ మీడియేషన్' సంస్థతో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, డిపార్ట్మెంట్ ఆఫ్ లీగల్ స్టడీస్ సంయుక్తంగా నిర్వహించిన ఒక్కరోజు కార్యశిబిరానికి చీమలపాటి రవి ముఖ్య అతిథిగా ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కక్షిదారులందరూ వీలైనంతవరకు స్నేహపూర్వకమైన విధానాల ద్వారా ముఖ్యంగా చట్టప్రకారమైన ఆర్బిట్రేషన్ అనగా మధ్యవర్తిత్వపు పద్ధతిలో కోర్టు వెలుపల వివాదాలను పరిష్కరించుకుంటే మెరుగైన ఫలితాలు ఉంటాయని సూచించారు. వైస్‌ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ కె.గంగాధర్ రావు ప్రస్తావించినట్లు ఆర్బిట్రేషన్ చట్టం ముందు నుంచి మన దేశంలో రచ్చబండ విధానం ద్వారా పెద్దలు తీర్పు చెప్పిన విషయాన్ని మరోసారి గుర్తు చేస్తూ గంగాధర్ రావు మాటలని ఏకీభవించారు. అయితే క్రమశిక్షణ, సహనం వంటి లక్షణాలతో శ్రమించాలని పిలుపునిచ్చారు. గతంలో ప్రజల్లో నిజాయితీ, సోదర భావాలు ఉండటం కారణంగా గ్రామ పెద్దల తీర్పులతో వివాదాలు సత్వరమే పరిష్కారం అయ్యేవన్న సంగతిని గుర్తు చేశారు. అయితే ఇప్పుడు మారిన కాలమానం ప్రకారం మనలో కోరికలు అధికమై అహంతో ప్రతిదీ లిటిగేషన్‌కే ప్రాధాన్యమిస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ క్రమంలోనే దేశవ్యాప్తంగా పరిష్కారం కానీ కేసుల సంఖ్య ఐదు కోట్లను దాటిపోవడం మనందరినీ భయభ్రాంతులకు గురి చేసే విషయంగా చెప్పుకొచ్చారు.గౌరవ అతిథి సుప్రీంకోర్టు ప్రముఖ న్యాయవాది ఆర్.శాంతన కృష్ణన్ మాట్లాడుతూ బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా న్యాయవిద్యలో ఆర్బిట్రేషన్‌ను ఒక సబ్జెక్టుగా తీసుకువచ్చి ఈ సమాజానికి ఎంతో మేలు చేస్తుందని కొనియాడారు. అయితే కేంద్రం మీడియేషన్ చట్టాన్ని 2023లో తీసుకువచ్చినప్పటికీ అమలుకు శ్రీకారం చుట్టుకపోవడం ఎంతో విచారకరమని అభిప్రాయపడ్డారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం తమ న్యాయవిభాగం ద్వారా న్యాయవాదులకు, విద్యార్థులకు ఇలాంటి వర్క్ షాప్‌లు నిర్వహిస్తూ వివాదరహిత సమాజ నిర్మాణానికి పూనుకోవటం ఎంతో అభినందనీయ విషయమని కొనియాడారు. విశ్వవిద్యాలయ ఉపకులపతి ప్రొఫెసర్ కె.గంగాధర్ రావు మాట్లాడుతూ తమ తాతల కాలంలో రచ్చబండ విధానంలో ముత్తాత మరియు తాత ఆ గ్రామస్తుల వివాదాలని పరిష్కరిస్తుంటే తద్వారా తన కుటుంబానికి దక్కిన కీర్తిని అనుభవిస్తూ తాము చాలా గర్వించేవారమని ఆయన తన గతాన్ని సభకు వివరించారు. విశ్వవిద్యాలయ రెక్టర్ ప్రొఫెసర్ కె.రత్నషీలామణి మాట్లాడుతూ వివాదాలు పెరిగిపోవటానికి చాలామంది న్యాయం కోసం కాకుండా తమ స్వార్ధ ప్రయోజనాల కోసం కోర్టు గుమ్మాన్ని ఆశ్రయిస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కార్యశిబిరం డైరెక్టర్ ప్రొఫెసర్ డాక్టర్.ఎల్ జయశ్రీ తన అధ్యక్ష ఉపన్యాసంలో ఆర్బిట్రేషన్ చట్టం గురించి కూలంకుషంగా వివరించి అందులో న్యాయవాదుల పాత్రని స్పష్టం చేశారు. కార్యక్రమంలో చివరిగా ఏసీఐఏఎం కో ఫౌండర్ డాక్టర్ సూర్యరాజు, వర్సిటీ రిజిస్ట్రార్‌లు న్యాయ విద్యార్థుల ఇంటర్న్‌షిప్‌కు సంబంధించిన అవగాహన ఒప్పంద పత్రాలను మార్పిడి చేసుకున్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ జి.సింహాచలం, హైకోర్టు న్యాయవాది, వర్సిటీ లీగల్ అడ్వైజర్ నర్రా శ్రీనివాసు, డాక్టర్ పివెంకటరమణ, డాక్టర్ నూతక్కి సతీష్, డాక్టర్ ఎస్.చంద్రశేఖర్, డాక్టర్ ఘంటా సతీష్ కుమార్, డాక్టర్ జ్యోతి సంపూర్ణ, బి.వి.చెన్నారావు, పరుచూరు కుమారి, ఆంగ్ల అధ్యాపకులు, సాఫ్ట్ స్కిల్స్ ట్రైనర్ అభిలాష్ గోపీనాథన్, ఇందిరా ప్రియదర్శిని లా కాలేజ్ ప్రిన్సిపాల్ నటరాజ్ తదితరులు పాల్గొన్నారు.





స్థానిక సంస్థల్లో పట్టుకోసం టిడిపి దూకుడు



స్థానిక సంస్థలలో పట్టుకోసం టిడిపి, వైసిపి మధ్య ప్రచ్ఛన్న యుద్ధం జరుగుతోంది. రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో స్థానిక సంస్థలలో పట్టుకోసం టిడిపి పూర్తిస్థాయిలో పావులు కదుపుతోంది. వైసిపిలో ఉన్న వారిని తమ వైపునకు తిప్పుకుని ఆయా మునిసిపాలిటీలపై టిడిపి పట్టు సాధిస్తోంది. అలాగే మండల, జిల్లా పరిషత్‌లలో కూడా పావులు కదుపుతోంది. ఇప్పటికే పలు మునిసిపాలిటీల్లో స్వతహాగా సొంత బలం లేకపోయినా మునిసిపల్ చైర్మన్‌తో పాటు మెజార్టీ కౌన్సిలర్లను కూడా తమ వైపు తిప్పుకోవడంలో టిడిపి పై చేయి సాధించింది. మాచర్ల, పిడుగురాళ్ల మునిసిపాలిటీల్లో 2021 ఎన్నికల సమయంలో టిడిపికి ఒక్క స్థానం లేకుండా లేకుండా వైసిపి ఏకపక్షంగా విజయం సాధించింది. మాచర్లలో టిడిపికి నామినేషన్లు వేయలేని స్థితిని వైసిపి కల్పించింది. కూటమి ప్రభుత్వం ఏర్పడగానే రాజకీయ పరిణామాలు వేగంగా మారాయి. ఇటీవల మాచర్లలో వైస్ చైర్మన్ పోలూరి నరసింహారావుతో పాటు, మరో 16మంది కౌన్సిలర్లను టిడిపిలో చేర్చుకుని మొత్తం కౌన్సిల్‌ను హస్తగతం చేసుకున్నారు. పిడుగురాళ్లలో నామినేషన్లు వేసిని టిడిపి వారిని ఉపసంహరింపచేసి ఏకగ్రీవంగా 33 మంది కౌన్సిలర్లను వైసిపి గెలిపించుకుంది. పిడుగురాళ్ల మునిసి పాలిటీలో 33 మంది కౌన్సిలర్లు ఉండగా ఒక్క కౌన్సిలర్ లేకున్నా 15 మంది వైసిపి నుంచి టిడిపిలో చేరారు. ఇద్దరు పరోక్షంగా మద్దతు పలికారు. చైర్మన్ కొత్త చిన సుబ్బారావుతో సహా 17 మంది టిడిపి మద్దతు తెలపడంతో వైస్ చైర్మన్‌గా ఉన్నం భారతీ ఆంజనేయులు గెలుపొందారు. పిడుగురాళ్ల మునిసిపాలిటీని కూడా టిడిపి తన అధీనంలోకి తెచ్చుకోగ లిగింది. తాజాగా గుంటూరు కార్పొరేషన్‌పై క్రమంగా పట్టు సాధిస్తుంది. స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో టిడిపి పై చేయిసాధించింది. ఆరుస్థానాలను కైవసం చేసుకుంది. రెండు మూడు రోజుల్లో మేయర్ పై అవిశ్వాసం పెట్టడానికి పావులు కదుపుతున్నారు. ఈ లోగా మేయర్ కావటి మనోహర్ నాయుడు శనివారం తన పదవికి రాజీనామా చేశారు. కార్పొరేషన్‌లో మొత్తం 56 మంది కార్పొరేటర్లు టిడిపికి 9,జనసేన 2, వైసిపికి 45 మంది ఉన్నారు. వైసిపి నుంచి ఇప్పటికే 18 మంది టిడిపిలో చేర్చుకున్నారు. అంతేగాక స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో మరో నలుగురు వైసిపి నుంచి టిడిపికి క్రాస్ ఓటింగ్‌కు పాల్పడ్డారు. దీంతో వైసిపి బలం 23కి తగ్గింది. అంతేగాక మేయర్‌ను ఇబ్బంది పెట్టడం ప్రారంభం కావడంతో ఆయన నేరుగా రాజీనామాకు సిద్ధపడ్డారు. మేయర్‌కు ఉన్న వ్యాపారాలను ఇబ్బంది పెడుతున్నారని అందుకే ఆయన రాజీనామా చేశారని కూడా కార్పొరేషన్ వర్గాల్లో ప్రచారం సాగుతోంది. గత ఆరు నెలలుగా మేయర్‌ను అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదు. డిసెంబరు నుంచి ఇప్పటి వరకు కౌన్సిల్ సమావేశం కూడా పూర్తిస్థాయిలో జరగలేదు. టిడిపి అవిశ్వాసం పెడితే పదవిచ్యుతుడు కావడం అనివార్యం కావడంతో ఆయన రాజీనామా చేశారని వైసిపి వర్గాలు చెబుతున్నారు. అయితే తాను రెడ్ బుక్ రాజ్యాంగం ద్వారా వేధిస్తున్నందుకు నిరసనగా రాజీనామా చేస్తునట్టు ఆయన ప్రకటించారు. తాజాగా జిల్లా పరిషత్‌లో కూడా ఆధిపత్య రాజకీయం చోటుచేసుకుంది. వైసిపి నుంచి చైర్‌పర్సన్‌గా గెలుపొందిన హెనీ క్రిస్టినా ఎన్నికలకు ముందే ఆమె టిడిపిలో చేరారు. తన భర్తకు తాడికొండ బాధ్యతల నుంచి తప్పించడంతో ఆమె భర్త కత్తెర సురేష్, క్రిస్టినా కలిసి టిడిపిలో చేరారు. ఆ తరువాత ఆమెతో పాటు మరో 11 మంది జెడ్‌పిటిసిలు వైసిపి నుంచి టిడిపిలో చేరారు. అయితే ఈ వ్యవహారంపై వైసిపి నేతలు ఎవ్వరూ పట్టించుకోలేదు. అయితే అనూహ్యంగా వైసిపి జెడ్‌పిటిసిలంతా శనివారం జరిగిన జిల్లా పరిషత్‌సర్వసభ్య సమావేశానికి గైర్హాజరు కావడంతో కోరం లేకుండా పోయింది. దీంతో సమావేశాన్ని వాయిదా వేశారు. జిల్లా పరిషత్‌లో మొత్తం 54 స్థానాలకు గాను 53 స్థానాలు వైసిపి, శావల్యాపురం స్థానం ఒక్కటే టిడిపి గెలుచుకున్నాయి. 53 మందిలో ఇప్పటి వరకు 11 మంది టిడిపిలో చేరినా ఇప్పటికి జిల్లా పరిషత్‌లో వైసిపికి బలం ఉంది. అయినా టిడిపి ఆధ్వర్యంలో నాయకులు జిల్లా పరిషత్‌పై పట్టు సాధించేందుకు ప్రయత్నిస్తున్నారు.

(ఎ.వి.డి.శర్మ)